PDF Compressor Free Version


Licensed to post without Prepayment No. J/Nellore/003/12-14 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 15.02.2013, శుక్రవారం
సంపుటి : 32 సంచిక : 37
పేజీలు : 12, వెల : ₹4

24గం॥ చిన్నపిల్లల స్పెషలిస్టులచే వైద్యం చేయు ఏకైక చిన్నపిల్లల సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్
నెలలు తక్కువ బిడ్డా ?
సంరక్షణ కొరకు...
పుట్టిన పిల్లల ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (NICU)
Dr. T. Ravikumar's
రిచ్ హాస్పిటల్
రవి చిన్నపిల్లల హాస్పిటల్



# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com



భారత స్వాతంత్ర్యోద్యమంలో కీలకపాత్ర పోషించి, ఆజాద్ హింద్‌ఫౌజ్ సైన్యాన్ని స్థాపించి తెల్లదొరల గుండెల్లో గుర్రాలను దౌడుతీయించిన సుభాష్ చంద్రబోస్, తన ఆధ్యాత్మిక బోధనలతో ప్రపంచాన్నే తమ వైపు తిరిగేలా చేసిన స్వామి వివేకానంద, తన రచనలతో అంతర్జాతీయ సమాజాన్నే నవచైతన్య బాట పట్టించిన కవీంద్రుడు రవీంద్రనాథ్‌ఠాగూర్ వంటి ఉద్దండులు ఉద్భవించిన నేల పశ్చిమబెంగాల్.

(మిగతా 5వ పేజీలో)

# బెంగాల్ టైగర్

- నిర్ణయాలలో 'దాదా'నే

ప్రశాంతతకు పేరుగాంచిన నెల్లూరుసీమలో అశాంతి, అభద్రత నెలకొంటుంది. దోపిడీలతో పొద్దు పొడుస్తుంది. హత్యలతో పొద్దువాలుతుంది. గుండెల మీద చేయివేసుకుని స్వేచ్ఛగా నిద్రపోయే పరిస్థితులు పోయి గుండెల్లో ఎప్పుడు కత్తులు దిగుతాయో తెలియని భయాందోళన వాతావరణం అలుముకుంది. నెల్లూరులో క్షణం.. క్షణం... భయం.. భయం... నెలకొంది.

(మిగతా 5వ పేజీలో)



## నెత్తురోడుతున్న నెల్లూరు...

# భయం.. భయం..!

- హత్యలు... దొంగతనాలు... అరాచకాలు
- డిజిపి సొంతజిల్లాలో మృగ్యమవుతున్న శాంతిభద్రతలు

ప్రజాస్వామ్య భారతదేశంలో అన్ని ప్రభుత్వ వ్యవస్థలూ భ్రష్టుపట్టి వున్నాయి. రాజ్యాంగ వ్యవస్థలకు సైతం రాజకీయ గ్రహణం పట్టి ప్రజలకు తగిన న్యాయం చేయలేకపోతున్నాయి.

ప్రతి వ్యవస్థ మీద కూడా అధికార రాజకీయ ముద్ర స్పష్టంగా కనిపిస్తుంది. దేశంలోనే అత్యున్నత నేర దర్యాప్తు సంస్థ సిబిఐ కేంద్రంలో ఎవరు అధికారంలో వుంటే వారికి జేబుసంస్థగా మారిపోతుంది. పోలీసువ్యవస్థ చూస్తే అధికార పార్టీల అడుగులకు మడుగులొత్తేదే! ఏ ప్రభుత్వ వ్యవస్థ చూసినా ప్రజలకంటే అధికారంలో వున్న రాజకీయ నాయకుల సేవకే ప్రాధాన్యతనిస్తుంది. దేశంలో ప్రతివ్యవస్థ పట్లకూడా ప్రజల్లో నమ్మకం క్రమంగా కరిగిపోతున్న నేపథ్యంలో సంచలనాత్మకమైన తీర్పులు, నిర్ణయాల ద్వారా న్యాయస్థానాలు మాత్రం కొంత విశ్వాసాన్ని పెంపొందించుకోగలుగుతున్నాయి.

(మిగతా 5వ పేజీలో)



- న్యాయమూర్తుల్లో అంతర్మథనం
- ఒత్తిళ్లకు లొంగకూడదని నిర్ణయం
- జగన్ కోసం ఎదురుచూస్తున్న జనం

## బెయిలివ్వకుంటే..

# అభాసుపాలౌతాం..

43 సంవత్సరాలుగా కస్టమర్ దేవుళ్ళ ఆదరాభిమానాలు పొందుతున్న...



శ్రీ గ్రోసు గోపాలయ్య

మురళీకృష్ణ 70 గ్రూప్ వారి

MK
CUISINE
Private Limited

అందిస్తున్న మరో రుచికరమైన కానుక

NIRVANA
A Fine Dining Experience

మోర్ సూపర్‌మార్కెట్ మిద్దెపైన, జి.కె.ఇంపీరియల్ టవర్స్, మెయిన్‌రోడ్డు, మాగుంట లేఅవుట్, నెల్లూరు.



శుభారంభం
ఫిబ్రవరి 17, ఆదివారం ఉ॥ 11గం.లకు

మీ ఆగమనం.. మాకు ఆనందం!



జి.సుబ్బారావు




వి.హజరత్‌బాబు



జి.మురళీకృష్ణ



జి.చైతన్యకృష్ణ



Ph: 2321777, 2348777 Email: nirvana.mkc@gmail.com

PDF Compressor Free Version



# 'క్యాప్' పెట్టుకుంటే సరికాదు!

## పోలీసులపై సోమిరెడ్డి ఫైర్



జిల్లా ఎస్పీ 'క్యాప్' వంటి అనాధాశ్రమాలు పెట్టుకుని వాటిని చూసుకుంటూ ప్రజల శాంతిభద్రతలను పూర్తిగా గాలికొదిలేసాడని తెలుగుదేశంపార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ధ్వజమెత్తారు. బుధవారం నెల్లూరులోని తెలుగుదేశంపార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన పోలీసులపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఆయన 'క్యాప్' పెట్టుకుని పదిమంది పిల్లల్ని చదివించగానే సరికాదు, నెత్తిమీద పెట్టుకున్న క్యాప్ గురించి కూడా ఆలోచించాలి. ఎస్పీ రమణకుమార్ సౌమ్యుడు, మంచివాడు. కాని పోలీసు ఉద్యోగానికి మంచితనంతో పాటు కాఠిన్యం కూడా వుండాలి. ప్రజలకు మంచిని పంచి, దుర్మార్గులకు తమ కాఠిన్యాన్ని రుచిచూపించాలి. కాని మన ఎస్పీకి అవి లేకుండా పోయాయి. ఆయన ధార్మిక కార్యక్రమాలపై చూపిస్తున్న శ్రద్ధ శాంతిభద్రతలపై చూపడం లేదు. ధార్మిక కార్యక్రమాలే ముఖ్యమనుకుంటే ఖాకీబట్టలు వదిలి కాషాయం ధరించండి. ధార్మిక కార్యక్రమాలకైనా పూర్తిన్యాయం చేయండి. ఈయన వెంటనే రాజీనామాచేసి అనాథాశ్రమాలు నడుపుకుంటే అనాథలు బాగుపడుతారు. మంచి ఆఫీసర్ వస్తే ప్రజలు బాగుపడతారు. జిల్లాలో జస్పాల్‌సింగ్, భూపతిబాబు, శ్రీనివాసరెడ్డి వంటి సింహాల్లాంటి ఆఫీసర్లు పనిచేసారు. రౌడీలను, గూండాలను జిల్లా నుండి తరిమికొట్టారు. జిల్లా ఎస్పీ వారి గురించి తెలుసుకునైనా రోషం తెచ్చుకుని పనిచేయాలని సోమిరెడ్డి సూచించారు.

జిల్లాలో ఎప్పుడూ లేనంతగా నేరాలు పెరిగాయి. హరనాథపురంలో తల్లీకూతుళ్ల హత్య జరిగి ఊరు వాడంతా ఒక్కటైతే కనీసం ఎస్పీకి సంఘటనా స్థలానికి వచ్చే తీరికలేకుండా పోయింది. ఈ జిల్లాకు చెందిన డిజిపి నెల్లూరు వస్తే గుళ్లు, గోపురాలు తిరగడానికి సరిపోతుంది. కనీసం నేరసమీక్ష చేసే తీరిక కూడా ఆయనకు వుండడంలేదు. డిజిపి మామగారి గేదె పోతే మాత్రం పోలీసులు ఆఘమేఘాల మీద వెదుకుతున్నారు. జిల్లాలో శాంతిభద్రతలు కాపాడడానికి పోలీసు స్టేషన్‌లు లేవు. డిజిపి మామ కేసులకో స్టేషన్, మంత్రి తమ్ముడి కేసులకో స్టేషన్, బావమరిది కేసులకో స్టేషన్ అన్నట్లుగా పరిస్థితి మారిందని ఆయన దుయ్యబట్టారు. గత రెండుమూడేళ్లుగా నెల్లూరుజిల్లా తీవ్రమైన నేరాలకు అడ్డగా మారిందని, పోలీసుల్లో స్పందన వుండడం లేదని ఆయన విమర్శించారు.

# ప్రజల ప్రాణాలకు రక్షణ కరువు

## ఎస్పీ కార్యాలయం ఎదుట కోటంరెడ్డి ధర్నా



ప్రజల ప్రాణాలకు రక్షణ కరువైందని ఏడాదిగా జిల్లాలో దొంగలు అనేక ప్రాంతాల్లో బంగారం, డబ్బుకోసం నిర్దాక్షిణ్యంగా గొంతులు కోస్తున్నారని వైఎస్సార్ సిపి నాయకుడు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పోలీసులపై విరుచుకుపడ్డారు. నెల్లూరు హరనాథపురంలో దినకర్‌రెడ్డి ఇంట్లో మంగళవారం కిరాతకులు మహిళల్ని హత్య చేసిన విషయం తెలుసుకున్న కోటంరెడ్డి తీవ్రస్థాయిలో స్పందించారు. జిల్లా ఎస్పీ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. సాయంత్రం 6గంటల నుండి 7 గంటల వరకు వందలాదిమంది కార్యకర్తలతో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా కోటంరెడ్డి మాట్లాడుతూ ఏడాదిగా జిల్లాలలో ప్రజలకు భద్రత కరువైందని, దుండగులు ఏరోజు ఎవరిని చంపుతారో తెలియని అయోమయ పరిస్థితి నెలకొందన్నారు. దీనికి ప్రత్యక్షనిదర్శనం హరనాథపురం సంఘటనే అన్నారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్‌సిపి నాయకులు కె.వి.రాఘవరెడ్డి, రూరల్ మండల కన్వీనర్ పిగిలం నరేష్‌యాదవ్, తాటి వెంకటేశ్వరరావు, నరశింహయ్య ముదిరాజ్, మందా బాబ్జీ, మురారి, పురుషోత్తంయాదవ్, హజరత్‌నాయుడు, మహేష్, ఫిరోజ్, నజీర్, షబ్బీర్, బత్తిన వెంకటేశ్వర్లు, శివప్రసాద్, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

**ప్రభుత్వాసుపత్రి వద్ద ఆందోళన:** హత్యలకు నిరసనగా దొడ్ల సుబ్బారెడ్డి ప్రభుత్వ వైద్యశాల వద్ద నగరంలోని వివిధ కళాశాలకు చెందిన విద్యార్థులు ఆందోళన చేపట్టారు. హంతకులను పోలీసులు కాల్చి చంపాలని డిమాండ్ చేశారు. భార్గవిరెడ్డి సహచర విద్యార్థులతో పాటు అన్ని కళాశాలల విద్యార్థులు ఆందోళన కార్యక్రమంలో పాల్గొన్నారు.

# నేత్రపర్వంగా సత్యసాయి నగరోత్సవం



నెల్లూరులోని రామ్మూర్తినగర్‌లో ఉన్న సత్యసాయి భజన మందిర వార్షికోత్సవ వేడుకలు సోమవారం నేత్రపర్వంగా జరిగాయి. ఈ సందర్భంగా సాయినామ సంకీర్తనలను ఆలపిస్తూ భక్తులు నగర సంకీర్తన నిర్వహించారు. అనంతరం మందిరంలో ప్రత్యేక అభిషేకాలను జరిపారు. సాయి సత్సంగ భజనలు చేశారు. అర్హులైన పేదలకు కుట్టుమిషన్లు, గ్రైండర్లు పంపిణీచేశారు. మధ్యాహ్నం అన్నసంతర్పణ చేశారు. సాయంత్రం సాయినామ భజనల అనంతరం సత్యసాయి చిత్రపటాన్ని వాహనంపై అలంకరించి సంకీర్తనలు ఆలపిస్తూ మంగళవాయిద్యాలతో మిరుమిట్లు గొలిపే విద్యుత్‌దీపకాంతులతో సత్యసాయి నగరోత్సవం ఊరేగింపు సాగింది. నగరోత్సవంలో దేవతామూర్తుల వేషధారణల్లో చిన్నారులు అందరిని ఆకట్టుకున్నారు. అధికసంఖ్యలో భక్తులు హాజరయ్యారు. సత్యసాయిసేవా సమితి కన్వీనర్ సుధాకర్, సభ్యులు పర్యవేక్షించారు.

## నెల్లూరులో ప్రతిష్టాత్మకంగా...

# జాతీయస్థాయి మహిళల హ్యాండ్ బాల్ పోటీలు




హ్యాండ్‌బాల్ పోటీల లోగోను ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ బి.శ్రీధర్

ప్రతిష్టాత్మకంగా 41వ సీనియర్ మహిళల జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ ఛాంపియన్ షిప్ పోటీలు ఈనెల17 నుండి 22వతేదీ వరకు నెల్లూరు వి.ఆర్. హైస్కూల్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ బి.శ్రీధర్ తెలిపారు. జిల్లా స్పోర్ట్స్ అథారిటీ, జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ సహకారంతో 27రాష్ట్రాల జట్లతో పాటు, భారత రైల్వే, రక్షణశాఖల జట్లు ఈ పోటీల్లో పాల్గొంటున్నట్లు తెలిపారు. అంతర్జాతీయస్థాయి పోటీల్లో పాల్గొన్న వివిధ రాష్ట్రాల క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. వీరందరికీ విఆర్‌సిలో భోజన ఏర్పాట్లు కల్పిస్తున్నామన్నారు. ఈ పోటీల నిర్వహణ కమిటీ ఛైర్మన్‌గా రాష్ట్ర ఆర్థిక శాఖమంత్రి ఆనం రామనారాయణరెడ్డి వ్యవహరిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోటీల నిర్వహణ లోగోను కలెక్టర్ ఆవిష్కరించారు. డిఎస్‌డిఓ యతిరాజులు, రాష్ట్ర హ్యాండ్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి సి.కొండలరావు, వైయస్‌డి రవిబాబు పాల్గొన్నారు.


సత్యంజీ గ్రూప్

సత్యంజీ సింహపురి సిటి

అందమైన గ్రీన్‌పార్క్

వి.ఆర్. స్కూల్ దగ్గర, ధనలక్ష్మీపురం, మెయిన్ రోడ్డు, ముత్తుకూరు రోడ్డు, నెల్లూరు.




డ్యూప్లెక్స్ హౌస్

ప్రారంభం ధర 50 లక్షలు

మొదటి ఇద్దరికి 5 లక్షల విలువ గల ప్లాటు గిఫ్ట్‌గా ఇవ్వబడును.

ఈ హౌస్ పూర్తి అయిన తరువాత ఖచ్చితమైన ధర 60 లక్షలు



డ్యూప్లెక్స్ హౌస్

ప్రారంభం ధర 46 లక్షలు

మొదటి ఇద్దరికి 5 లక్షల విలువ గల ప్లాటు గిఫ్ట్‌గా ఇవ్వబడును.

ఈ హౌస్ పూర్తి అయిన తరువాత ఖచ్చితమైన ధర 56 లక్షలు

మీ పెట్టుబడులు రెట్టింపు కొరకు You Tube, R.R., S.Tv., Gem Channels చూడండి.

శుక్రవారం 7.30 P.M.

శనివారం 10.30 A.M.

7.30 P.M.

ఆదివారం 10.30 A.M.

బ్యాంకు లోన్ సౌకర్యం కలదు

9133 222 558

0861-2318286, 2341183

08622272555


## ఘంటసాల స్వరమధురం...

# నేటికీ అజరామరం

- సినీ రచయిత వెన్నెలకంటి



ఘంటసాల గీతాలను ఆలపిస్తున్న గాయకుడు బాలకామేశ్వరరావు

అమరగాయకుడు ఘంటసాల స్వరమధురం... నేటికీ అజరామం అని ప్రముఖ సినీరచయిత వెన్నెలకంటి రాజేశ్వరప్రసాద్ పేర్కొన్నారు. నెల్లూరు టౌనుహాలులో సోమవారం రాత్రి ఘంటసాల సంగీతసంస్థ 10వ వార్షికోత్సవం, ఘంటసాల వెంకటేశ్వరరావు 39వ వర్థంతిని పురస్కరించుకుని నిర్వహించిన ఘంటసాల స్వరార్చన సభలో వెన్నెలకంటి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఈ తెలుగు నేలలో శ్రీ వెంకటేశ్వరస్వామి చిత్రపటం ఉండని తెలుగువారు, ఘంటసాల పాటవినని ఇల్లు ఉండదన్నారు. ఆయన తర్వాత అంత పేరు పొందిన ఘనత సాధించిన ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం మన నెల్లూరీయుడు కావడం మనకెంతో గర్వకారణమన్నారు. సినీగేయ రచయిత భువనచంద్ర సంగీత సంస్థ కళాకారులను అభినందించారు. ఈ సందర్భంగా గాయకుడు బాల కామేశ్వరరావు పాడిన ఘంటసాల పాటలు ఆహూతులను అలరించాయి.

ఈ కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ ఎస్పీ ఏసి నాగేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హోటల్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు అమరావతి కృష్ణారెడ్డి, విశ్రాంత నెల్లూరు జాయింట్ సబ్ రిజిస్ట్రార్ పూడి నరేంద్రరావు, ఒంగోలు ఘంటసాల నేషనల్ ఆర్ట్స్ అకాడమి అధ్యక్షుడు టి.విజయ్‌కాంత్, సంస్థ అధ్యక్ష కార్యదర్శులు గట్టుపల్లి ఆదిశేషు, కెవిఎస్ ప్రసాద్, కనుపర్తి శ్రీనివాసమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# కళాకారులకు సత్కారం

నెల్లూరు టౌనుహాలు రీడింగ్‌రూమ్‌లో ఈనెల 10న రామశ్రీ ఆర్కెస్ట్రా కామాక్షి ఆర్ట్ క్రియేషన్స్ సంయుక్త నిర్వహణలో శతగాత్ర సమ్మేళనం, వివిధ రంగాలలో నిష్ణాతులైన 99మంది కళాకారుల సత్కారం కార్యక్రమం జరిగింది. ఉదయం పలువురు గాయకులు ఆలపించిన భక్తిగీతాలు, లలితగీతాలు అందర్నీ అలరించాయి. సాయంత్రం విభిన్న రంగాలలో ప్రతిభామూర్తులకు ఘనసత్కారం చేయడం నెల్లూరీయులకు ఆనందం కలిగించింది. కార్యక్రమంలో నగర ప్రముఖులు కొండా బలరామిరెడ్డి, ఎస్సార్కె స్కూల్ కరస్పాండెంట్ పి.కృష్ణమూర్తి ఒమ్మిన సుబ్రహ్మణ్యం, రాళ్ళపల్లి రామసుబ్బారావులు ప్రసంగించగా శ్రీ శైలమల్లికార్జునరావు, కె. శివకుమారాచార్య, యనమండ్ర నాగదేవిప్రసాద్, బివి.నరసింహం, రాళ్ళపల్లి రామసుబ్బలక్ష్మి, భేతనచాట్ల వాణి, లక్ష్మీశైలజ, అనూరాధ జ్యోతిప్రకాశనం చేసారు.

# చెంగాళమ్మ ఆదాయం 21.31లక్షలు

నెల్లూరుజిల్లా సూళ్ళూరుపేట చెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారికి మూడు నెలల హుండీ రాబడి 21.31లక్షలు ఆదాయం వచ్చింది. జొన్నవాడ కామాక్షితాయి ఇఓ రవీంద్రరెడ్డి పర్యవేక్షణలో ఆలయ హుండీని లెక్కించారు. ఆలయ పాలకమండలి ఛైర్మన్ ఇసనాక హర్షవర్ధన్‌రెడ్డి, ఇఓ పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి, పాలకమండలి సభ్యులు హుండీ లెక్కింపు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు ఈపూరు వేదగిరిరెడ్డి, వాసంరెడ్డి వేణుగోపాలరెడ్డి, బైరి పార్థసారథిరెడ్డి, అయితా శ్రీధర్, అట్రంబాక దొరబాబురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

PDF Compressor Free Version





# చెరొకటి?

- రాజీఫార్ములా కుదిరింది.
- పదవుల పంపకమే మిగిలింది.



ఈ నెల 18న జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఛైర్మన్ ఎంపిక జరగబోతుంది. డీసీసీబీ, డీసీఎంఎస్ రెండు పదవులు కూడా అధికార పార్టీవే! దీనికి బాగానే మెజార్టీ వచ్చింది. కాకపోతే పదవుల పంపకం ఎలా సాగుతుందన్నదే ప్రశ్నగా మారింది. డీసీసీబీ ఛైర్మన్ కోసం ఆనం మనిషిగా మెట్టుకూరు ధనుంజయరెడ్డి, సీఎం వర్గీయునిగా సుమంత్‌రెడ్డి రంగంలో వుండినారు. డీసీసీబీ ఒకరికి, డీసీఎంఎస్ మరొకరికి ఇచ్చే విధంగా రాజీఫార్ములాను సిద్ధం చేసి ఈ మేరకు ఏ పదవి ఎవరికి ఇవ్వాలనే దాని మీద ఒక నిర్ణయానికి వచ్చారు. మంత్రి ఆనం అనుచరుడైన మెట్టుకూరు ధనుంజయరెడ్డికి జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ ఛైర్మన్ పదవి దక్కనుంది. ఇటీవల హైదరాబాద్‌లో జిల్లా ఇన్‌చార్జి మంత్రి పితాని సత్యనారాయణ నివాసంలో జరిగిన సమావేశంలో జిల్లా కాంగ్రెస్ నేతలంతా కూడా ధనుంజయరెడ్డికే ఆ పదవి కట్టబెట్టేందుకు అంగీకరించారు. కాగా ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి వర్గీయుడిగా తెరమీదకు వచ్చిన వరిణి సొసైటీ ఛైర్మన్ సుమంత్‌రెడ్డికి డీసీసీబీ వైస్‌ఛైర్మన్ లేదా డీసీఎమ్ఎస్ ఛైర్మన్ పదవులలో ఒకటి దక్కే అవసకాశం వుంది.

మరోపక్క నేదురుమల్లి వర్గీయులు కూడా డీసీఎంఎస్ పదవి కోసం పట్టుబడుతున్నట్లు తెలుస్తుంది. వెంకటగిరి నియోజకవర్గంలో 12సొసైటీలు, గూడూరు నియోజకవర్గంలో వాకాడు కలుపుకుని మొత్తం 13సొసైటీలు వారి చేతిలో వున్నాయి. కాబట్టి డీసీసీబీ కాకపోయినా డీసీఎంఎస్ తమకు ఇవ్వాలని వాళ్లు పట్టుబడుతున్నారు. వాకాడు సొసైటీ ఛైర్మన్ దామోదరరెడ్డిని ఈ పదవికి బలంగా ప్రతి పాదిస్తున్నారు. జిల్లాలో నేదురుమల్లి వర్గం బాగా పలుచబారుతోంది. తమ వర్గ ఉనికిని కాపాడుకోకుంటే ఇకముందు వాళ్ల వెంట అరకొరగా వున్న నాయకులు కూడా మిగలరు. మొన్నటికి మొన్న చూస్తే నేదురుమల్లి రాజ్యలక్ష్మికి మహిళా కమీషన్ ఛైర్మన్ పదవి నోటిదాకా వచ్చి జారిపోయింది. ఇకముందు తమకు ఏ పదవీ లేకపోయినా, అనుచరులకు కొద్దోగొప్పో పదవులు ఇప్పించలేకపోయినా తమ వర్గం అని చెప్పుకోవడానికి మనుషులు మిగలరని నేదురుమల్లి రాజ్యలక్ష్మి, నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డిలు గుర్తించారు. అందుకే డీసీఎంఎస్ కోసం ప్రయత్నిస్తున్నారు.

## బ్యాంకు తిప్పలు తిప్పేస్వామికే!



ఈ నెల 18న కేంద్ర సహకార బ్యాంకు ఛైర్మన్, పాలకవర్గం, జిల్లా సహకార మార్కెటింగ్ శాఖ ఛైర్మన్, పాలకవర్గం ఎంపిక జరగాల్సివుంది. ఈ రెండు పాలక వర్గాలు అధికార కాంగ్రెస్‌కే దక్కనున్నాయి. అయితే డీసీసీబీ ఛైర్మన్ పదవి కోసం పలువురు సొసైటీ ఛైర్మన్‌ల మధ్య తీవ్రమైన పోటీ నెలకొన్న నేపథ్యంలో నేతలు, వర్గాల మధ్య సమన్వయం కోసం, ఏకాభిప్రాయ సాధన కోసం నీ తిప్పలు నువ్వు పడమని జిల్లా పరిశీలకునిగా పలమనేరు మాజీఎమ్మెల్యే తిప్పేస్వామిని నియమించారు. సీఎం సొంతజిల్లా అయిన చిత్తూరుకు చెందిన తిప్పే స్వామినే ఇక్కడకు పరిశీలకుడిగా పంపించడం ఆనం సోదరులకు చెక్‌పెట్టడానికేననే వూహాగానాలు వెలువడ్డాయి. డీసీసీబీ ఛైర్మన్ పదవి ఆనం వర్గీయుడు మెట్టుకూరుకు దాదాపు ఖరారైన నేపథ్యంలో మిగిలిన పదవులను అన్ని వర్గాలకు సమంగా పంచి నాయకుల మధ్య సమన్వయం సాధించేందుకే తిప్పేస్వామిని ఇక్కడకు పంపుతున్నట్లు తెలుస్తుంది.

# పార్టీలోనూ పట్టుపోయింది

## ప్రతిష్ట పెంచుకున్న ప్రత్యర్థులు





సొసైటీ ఎన్నికలలో సొంత మండలంలోని రెండు సొసైటీలనే కాదు, సొంత ఊరు బ్రాహ్మణపల్లి సెగ్మెంట్‌ను కూడా గెలిపించుకోలేకపోవడంతో మేకపాటి సోదరులు పార్టీపై సైతం పట్టును కోల్పోయే పరిస్థితి వచ్చింది. వీళ్ల నాయకత్వంలో ముందుకుపోతే పార్టీకి తీరని నష్టం జరుగుతుందనే సంకేతాలు వెలువడుతున్నాయి. పార్టీకి జిల్లాలోనే కాదు రాష్ట్రంలో కూడా నాయకులం అని చెప్పుకుంటున్న మేకపాటి సోదరుల అసలు సత్తా ఏంటో ఈ సహకార ఎన్నికలలోనే వెల్లడైంది. ఈ ఎన్నికలలో మేకపాటి సోదరుల కంటే కూడా వాళ్ల ప్రత్యర్థి వర్గం కొన్ని మెరుగైన ఫలితాలను సాధించగలిగింది.

ఉదయగిరి, ఆత్మకూరు అసెంబ్లీలు రెండు మేకపాటి సోదరుల ఆధీనంలోనే వున్నాయి. ఆత్మకూరు నియోజకవర్గ పరిధిలో ఒక్క సొసైటీని గెలుచుకోలేకపోయారు. సొంత మండలమైన మర్రిపాడు పరిధిలోగల భీమవరం, బూదవాడ సొసైటీలలో కేవలం మూడేసి సెగ్మెంట్లలో మాత్రమే గెలవగలిగారు. ఈ రెండు నియోజక వర్గాలకుగాను సీతారాంపురం మండలం మారంరెడ్డిపల్లె సొసైటీని మాత్రమే వీళ్లు గెలవగలిగారు. ఉదయగిరి నియోజకవర్గ పరిధిలోకి వచ్చే కలిగిరి మండలం సిద్ధనకొండూరు సొసైటీని కాకాణి గోవర్ధన్‌రెడ్డి అనుచరుడైన మెట్టుకూరు చిరంజీవిరెడ్డి గెలిపించుకున్నారు. ఇందులో మేకపాటి సోదరుల పాత్రేమీలేదు. కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి నాయకత్వంలోని నెల్లూరురూరల్ నియోజకవర్గంలో రెండు సొసైటీలను వైయస్సార్ కాంగ్రెస్ గెలుచుకోగలిగింది. వైకాపాకు దక్కిన మిగిలిన సొసైటీలలో గెలిచినవాళ్లు కూడా కాకాణి వర్గీయులే వుండడం విశేషం!

- ముదిరిన వర్గపోరు...

# వైకాపాలో చిచ్చుకు శ్రీకారం







తినే అన్నంలో మట్టిపోయడం, తాగే నీళ్లల్లో జిడ్డు కలపడం వంటివి రాజకీయాలలో సహజం. ప్రస్తుతం జిల్లా వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీలో అవే జరుగుతున్నాయి. ఆనం వెంకటరమణారెడ్డి అనే ఆరు అడుగుల కంటే పొడవున్న నాయకుడు కాంగ్రెస్ నుండి తెలుగుదేశంలోకి ఆపైన ప్రజారాజ్యంలోకి దూకి ఇప్పుడు వైయస్సార్‌కాంగ్రెస్‌లో వున్నాడు. రాజకీయంగా చాలా తక్కువ కాలంలోనే నాలుగు పార్టీలు మారి గతంలో మాదాసు గంగాధరం, రావుల అంకయ్యగౌడ్ వంటివారి పేరుమీదున్న రికార్డును బద్దలు బద్దలు చేసేసాడు. వైయస్సార్ కాంగ్రెస్‌లో చేరితే చేరాడు... అక్కడ కుదురుగా వుంటున్నాడా అంటే అదీ లేదు. కలబెట్టి కుళ్లబెట్టే రాజకీయాలకు శ్రీకారం చుట్టాడు.

ఈ సీటు నీదీ అంటూ వైకాపా అధినేత వై.యస్.జగన్మోహన్‌రెడ్డి ఎవరికీ పవర్ ఆఫ్ అటార్నీ ఇవ్వకపోయినా జగన్ పార్టీ పెట్టిన రోజు నుండి నెల్లూరురూరల్‌లో కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, నెల్లూరు నగరంలో అనిల్‌కుమార్‌యాదవ్‌లు పని చేస్తున్నారు. ఈ రెండు సీట్ల మీద వారికి గంపెడాశలు వున్నాయి. నెల్లూరు రూరల్‌లో తన పట్టును పెంచుకునేందుకు గడపగడపకు వైయస్ఆర్ పేరుతో 141రోజుల పాటు కోటంరెడ్డి చేసిన పాదయాత్ర జయప్రదమైంది. పార్టీ కోసం వీళ్లు పనిచేస్తుండగా వీరికి వెనుక ఆనం వెంకటరమణారెడ్డి, అబ్దుల్ అజీజ్ అనేవాళ్లను మేకపాటి సోదరులు తరిమారు. అజీజ్ ఈమధ్య కొంత తగ్గాడు. ఆనం వెంకటరమణారెడ్డి మాత్రం కోటంరెడ్డితో పోటీ పడాలనుకుంటున్నాడు. అవసరం లేకపోయినా నెల్లూరు నగరం కన్వీనర్ పదవిని ఆనం వెంకటరమణారెడ్డికి ఇప్పించారు మేకపాటి సోదరులు. దీంతో పార్టీలో మొదటే చేరిన వారిలో అసంతృప్తి రేగింది.

ఇప్పుడు ఆనం వెంకటరమణారెడ్డి 'ప్రజాబంధం' అనే కార్యక్రమం పెట్టడమే కాక దానికి సినిమాలెవల్లో 'నిరంతరం' అనే ట్యాగ్‌ను కూడా తగిలించాడు. నగరంలో, రూరల్‌లో ఈయన తిరుగుతానంటున్నాడు. పనిచేస్తున్న వాళ్లకు పొగబెట్టాలనే దిశగానే ఈయన 'ప్రజాబంధం' పెట్టు కోవడం విశేషం.

2009 ఎన్నికలలో వివేకా మీద ప్రజారాజ్యం అభ్యర్థిగా 3131ఓట్ల తేడాతో మాత్రమే ఓడిపోయానని, రూరల్‌లో గట్టిపోటీ ఇచ్చానని ఆనం వెంకటరమణారెడ్డి అంటున్నారు. ఆరోజు వివేకాకు ఆనం వెంకట రమణారెడ్డికి కాదు పోటీ. వివేకాకు వివేకానే! ఆయన మీద ఆరోజున్న వ్యతిరేకత, చిరంజీవి గ్లామర్ వల్లే ఆనం వెంకటరమణారెడ్డికి అన్ని ఓట్లు వచ్చాయి. ఆరోజు ఈయన కాకుండా ఇంకెవరన్నా అభ్యర్థి అయ్యుంటే గెలిచివున్నా ఆశ్చర్యపోవాల్సిందేమీ లేదు. గత ఎన్నికలలో ఆనం వెంకటరమణారెడ్డిది వాపేగాని బలుపు కాదు. ఈ వాస్తవం ఆయన గ్రహించాల్సి వుంది.

# సాధ్యంకాని గుట్కా నిషేధం

## చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం




గుట్కా మరిగిన యువతను దారి మళ్లించడం అంత సులభంకాదు. దానిని సేవించకుండా ఆపడం ఆ హరిహరాదులకు కూడా సాధ్యమయ్యేట్టులేదు. గుట్కా నమిలితే నా సామిరంగా మజా మజాగుంటుందని, దానిని మానేస్తే పిచ్చిపట్టినట్టుంటుందని వారి ఉవాచ. కాని గుట్కా నమిలితే కొన్నాళ్లకు రకరకాల రుగ్మతలకులోనై ప్రాణాలు గుట్కాయస్వాహా అయిపోతాయని వైద్యనిపుణులు హెచ్చరించగా ఎట్టకేలకు గత జూలైలో ప్రభుత్వం 16 రాష్ట్రాలు, మూడు కేంద్రపాలిత ప్రాంతాలలో నిషేధం విధించింది. కాని ఏం లాభం, వాస్తవంలో ఆ నిషేధం అమలు అంతంత మాత్రంగానే కనిపిస్తుంది. ముఖ్యంగా మనరాష్ట్రంలో గుట్కా బ్లాక్‌మార్కెట్ మూడు పాన్‌పరాగ్‌లు ఆరు పాన్ మసాలాలుగా విరాజిల్లుతుంది. నెల్లూరుజిల్లాలోని కలువాయిలో పాఠశాలలు హాస్పిటల్, బస్టాండు పరిసరాలలోనే వీటి అమ్మకాలు సాగిస్తున్నారు. రెండు రూపాయలుండే యం.సి గుట్కా 6, 7రూపాయలు, ఒక్క రూపాయి ఖరీదైన సియ్‌గుట్కా 4, 5రూపాయలు 7రూపాయలు విలువచేసే మానిక్‌చంద్ 10, 20 రూపాయలు పలుకుతూ బ్లాక్‌మార్కెట్‌కు ఊపునిస్తున్నాయి. మండలకేంద్రమైన కలువాయిలోనే కాకుండా చుట్టుపక్కల పల్లెల్లో కూడా వీటి అమ్మకం విచ్చలవిడిగా సాగుతున్నా అధికారులు తగుచర్యలు తీసుకోకుండా గుట్కా నిషేధం పట్ల ఉదాసీన వైఖరి ప్రదర్శిస్తున్నారు. ఏదైనా అలవాటుగా మారితే దానిని మానుకోవడం ఎంతో కష్టసాధ్యమన్నది తెలిసిన విషయమే. అలా గుట్కాకు అలవాటు పడిన ప్రతి ఒక్కరు, దానిని మానలేక ఎక్కువ ఖరీదైనా దొంగదారిలోనైనా కొనుగోలు చేస్తుండడం వల్ల ఈ వ్యాపారం జోరుగా సాగుతుంది. క్యాన్సర్ ఇతర అనారోగ్య సమస్యలకు మూలమయ్యే ఈ మహమ్మారిని నిషేధిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సరిగా అమలు చేసేలా అధికారులు ప్రయత్నిస్తే ఎంతో క్షేమదాయకం.

# ఇంతియాజ్ ఆర్కిటెక్ట్ కాదు

ఈ నెల 12వ తేదీ నెల్లూరు హరనాథపురంలో జరిగిన దారుణ మారణకాండకు కారకుడైన ఇంతియాజ్ ఆర్కిటెక్ కాదని ది కన్సల్టింగ్ సివిల్ ఇంజనీర్స్ ఆర్కిటెక్ట్స్ మరియు ఎల్‌బియస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఖండిస్తుంది. హరనాథపురంలో జరిగిన దారుణ మారణకాండకు సూత్రధారియైన ఇంతియాజ్ ఆర్కిటెక్ట్ అని కొన్ని పత్రికల్లో, టీవీ ఛానల్స్‌లో వచ్చిన కథనాన్ని అసోసియేషన్ ఖండిస్తూ అతను కేవలం ఇంటీరియర్ వర్క్ కాంట్రాక్టర్ మాత్రమేనని. ప్రజలు దయచేసి ఆర్కిటెక్ట్ ఇంజనీర్లను అపార్థం చేసుకోవద్దని అసోసియేషన్ అధ్యక్షులు శ్రీరాం బాబురావు ఒక ప్రకటన ద్వారా ప్రజలకు తెలియజేశాడు.

PDF Compressor Free Version






## మంచిపని చేసారు

పార్లమెంట్పై దాడి నిందితుడు అఫ్జల్గురును ఎప్పడో ఉరితీసి వుండాల్సింది. ఇప్పటికైనా ఉరితీసి మంచిపని చేశారు. భారత్ శాంతి కాముక దేశం. అయితే అన్ని విషయాలలో ఈ శాంతి, సహనం పనికిరావు. దేశానికి పెనుసవాల్గా మారిన ఉగ్రవాదం విషయంలో కఠినంగా వుండాల్సిందే!

ఆర్.టి.రవి, ఎస్.ఆర్.పురం.

## ఆధార్ తిప్పలేంటి!

ఆధార్ కార్డుల జారీ ప్రక్రియ ఒక తలాతోక లేకుండా సాగిపోతుంది. దీనికి నిర్దిష్ట ప్రణాళిక అంటూ లేదు. దేశంలో వున్న ప్రతి పౌరుడికి గుర్తింపుకార్డు వుండేలా ఈ ప్రక్రియను నిర్వహించాలి. కాని ఆధార్ కేంద్రాల వద్దకు వచ్చిన వారికే ఆధార్కార్డులు అన్న చందంగా ఈ ఆధార్కార్డుల ప్రక్రియ సాగడం విచారకరం.

ఎస్.సుజాత, చింతవరం.

## ఫుట్పాత్లు కట్టండి

నెల్లూరు నగరంలో ప్రధాన రహదారి జిఎన్టి రోడ్డును వెడల్పు చేస్తున్నారు. సంతోషం. అలాగే మరికొన్ని రహదారులను అభివృద్ధి చేస్తున్నారు. రోడ్లు వేయగానే మార్జిన్లలో ఫుట్పాత్లను నిర్మిస్తే ఆ రోడ్లు పాడవకుండా వుంటాయి. అలాగే పాదచారులు నడవడానికి సౌకర్యవంతంగా వుంటుంది. ఈ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలి.

జె.ఎస్.రావు, నెల్లూరు.

## ఇంటర్ప్రాక్టికల్స్ టంబ్లింగ్ పద్ధతి!

ఈ విద్యాసంవత్సరం నుండి ఇంటర్ ప్రాక్టికల్స్ జంబ్లింగ్ పద్ధతిలో నిర్వహించనున్నట్లు ఇంటర్ మీడియట్ బోర్డు ప్రకటనల్లో తెలియజేస్తోంది. ప్రయోగశాలలులేని కాలేజీలు గల్లీకొకటి ఉన్నాయి ఒక వేళ ప్రయోగశాలలు ఉన్నా మొరాయించే పరికరాలు ఉన్న ఈ పరిస్థితులలో విద్యార్థుల మీద ప్రయోగాలు చేయడం ఎలా ఉందంటే కొత్త ఔషధాలు కనిపెట్టిన శాస్త్రవేత్తలు జనాల మీద ప్రయోగాలు చేస్తున్నట్లుంది. ఇది జంబ్లింగ్ పద్ధతికాదు. ముమ్మాటికీ టంబ్లింగే!

కురుగూరు రంగనాథం, నెల్లూరు.

## 'ప్రభా'తం

అలస్యమైనా చివరకు జాతియావత్తు ఆశించిందే జరిగింది. త్యాగధనుల ఆత్మ శాంతించేలా ఓ క్రూరుడి మృతదేహం ఉరికొయ్యకు వేలాడింది. ఓట్ల బ్యాంకు రాజకీయాలను ధైర్యంగా పక్కనపెట్టి కేంద్రంలోని యూపిఏ ప్రభుత్వం రెండోసాహసానికి సిద్ధపడింది. తద్వారా ఉగ్రవాదులకు ఇక భారతదేశం స్వర్గధామం కాబోదని కుండబద్దలుకొట్టి చాటింది.

భారత ప్రజాస్వామ్య వ్యవస్థకు ప్రతీక. ప్రపంచంలోనే అత్యున్నతమైన ప్రజాస్వామ్య ప్రభుత్వ ప్రతినిధులకు వేదిక భారత పార్లమెంట్పై దాడికేసులో ప్రధాననిందితుడు, కరుడుగట్టిన ఉగ్రవాద సంస్థ జైష్ ఏ అహ్మద్ సంస్థకు చెందిన ఉగ్రవాది మహ్మద్ అఫ్జల్గురుకు ఫిబ్రవరి 9వ తేదీ ఉదయం 8గంటలకు తీహార్జైలులో ఉరిశిక్షను అమలుచేయడం ద్వారా ఉగ్రవాదంపై ఉక్కుపాదం మోపుతామని చెప్పిన మాటను యూపిఏ ప్రభుత్వం ఆచరణలో చూపింది. మొన్నటికి మొన్న ముంబైదాడుల నిందితుడు అజ్మల్ అమీర్ కసబ్ను ఉరితీయడం ద్వారా ఉగ్రవాదం పీచమణచడానికి ధైర్యంగా అడుగు ముందుకేసిన కేంద్ర హోంశాఖ, అఫ్జల్గురు ఉరితో ఉగ్రవాదుల పట్ల తన ధృడవైఖరిని మరోసారి చాటుకుంది. దీనిద్వారా యూపిఏ ప్రభుత్వం ఉగ్రవాదం పట్ల మెతకవైఖరి అవలంబిస్తుందంటూ ప్రధానప్రతిపక్షం బీజేపీ చేస్తున్న విమర్శలను సమర్థవంతంగా తిప్పికొట్టగలిగింది.

### ఉగ్రవాదంపై గు(ఉ)రి!



కేంద్రంలోని యుపిఏ ప్రభుత్వం ధైర్యంగా మరో ముందడుగు వేసింది. పార్లమెంట్పై దాడిచేసి దేశ సమగ్రత, సార్వభౌమత్వాన్ని సవాలుచేసిన నిందితులను ఉరికంబం ఎక్కించడం ద్వారా ఉగ్రవాదంపై ఇక ఉపేక్షించే విధానాన్ని అనుసరించబోమని చాటిచెప్పింది.

దయ, జాలి, ప్రేమ, క్షమించే తత్వానికి మారుపేరయిన భారతదేశంలో మూడునెలల వ్యవధిలో ఇద్దరు కిరాతక ఉగ్రవాదులను ఉరితీయడం ద్వారా కర్కశత్వంపై కఠినంగా కూడా వుండగలమని చెప్పారు. ముఖ్యంగా ప్రణబ్ ముఖర్జీ రాష్ట్రపతి అయ్యాకనే ఇద్దరు ప్రధాన ఉగ్రవాదుల క్షమాభిక్షను తిరస్కరించడం, వారిని వెంటనే ఉరి తీయడం జరిగాయి. తీవ్రమైన నేరాలు, ఉగ్రవాద చర్యలు విషయంలో రాష్ట్రపతి భవనం ఏ మాత్రం ఉదారం చూపబోమని రాష్ట్రపతి భవన్ హెచ్చరికలు జారీచేసింది. రాష్ట్రపతిగా ప్రణబ్ నిర్ణయాలను కాంగ్రెస్ అధిష్టానం సైతం తిరస్కరించే ధైర్యం చేయలేకపోతుండడంతో ఉగ్రవాదుల తలలకు ఉరితాళ్లు తప్పనిసరిగా బిగించాల్సి వస్తుంది. రాబోయేది ఎన్నికల సీజన్ కావడంతో యూపిఏ ప్రభుత్వం ఉరిశిక్షలను ఆపలేకపోతుంది. నానాటికీ దిగజారుతున్న ప్రభుత్వ ప్రతిష్టను కాపాడుకోవడానికి కూడా యూపిఏకి ఇవి అస్త్రాలయ్యాయి. పోయిన పరువును తెచ్చుకోవడానికి ఉగ్రవాదుల మరణశిక్షలు ఒక ప్రధానమార్గంగా మారుతున్నాయి.

కసబ్, అఫ్జల్గురుల మరణశిక్షలను యూపిఏ ప్రభుత్వం చాలాకాలమే నాన్చింది. ఈ ఉగ్రవాదులకు ఉరిశిక్షలు అమలు చేయడానికి మీనమేషాలు లెక్కించింది. 2001 డిసెంబర్ 13న భారత పార్లమెంట్పై ఐదుగురు సభ్యులుగల ఉగ్రవాద బృందం దాడికి తెగబడగా పార్లమెంట్ భద్రతా సిబ్బంది, ఢిల్లీ పోలీసులు, కేంద్ర రిజర్వ్దళాలు వారి దాడిని సమర్థవంతంగా అడ్డుకున్నాయి. ఈ ఉగ్రదాడిలో పార్లమెంట్ ఆవరణలో పనిచేసే ఒక తోటమాలితో పాటు మరో 8మంది భద్రతా సిబ్బంది మరణించారు. వీళ్లు తెగించకపోయి వుంటే 544మంది లోక్సభ సభ్యులు, 250మంది రాజ్యసభసభ్యులు, వీరిలో ప్రధాని, కేంద్రమంత్రులు, స్పీకర్లు వంటి ఉద్దండులు వుండే పార్లమెంట్ భవనంలో ఎలాంటి రక్తపాతం జరిగివుండేదో వూహించుకుంటేనే ఒళ్లు జలదరిస్తుంది. భారత ప్రజాస్వామ్య వ్యవస్థపైనే జరిగిన దాడి ఇది. భారత సార్వభౌమత్వాన్ని ప్రశ్నించిన సంఘటన ఇది. ఈ సంఘటన జరిగిన నాటికి కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం వుంది. కేంద్ర హోంశాఖ ఈ సంఘటనపై వెనువెంటనే దర్యాప్తు జరిపించడం, ఈ కేసులో ప్రధాన నిందితుడిగా వున్న అఫ్జల్గురుకు 2003 అక్టోబర్లో ఉరిశిక్ష విధించాలని ఢిల్లీ హైకోర్టు తీర్పునివ్వడం జరిగింది. దీనిమీద నిందితుడి తరపున సుప్రీంకోర్టులో అప్పీలు చేసారు. 2005ఆగస్టులో ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన ఉరిశిక్ష తీర్పును సుప్రీంకోర్టు సమర్థించింది. 2007లో అఫ్జల్గురు పెట్టుకున్న రివ్యూపిటిషన్ను సైతం సుప్రీంకోర్టు తిరస్కరించింది.

అయితే అప్పుడు కేంద్రంలో అధికారంలో వున్న యూపిఏ అఫ్జల్గురు ఉరి విషయాన్ని ఓటుబ్యాంకు రాజకీయంవైపు మళ్లించింది. అఫ్జల్గురు ఉరి విషయంపై జమ్మూ-కాశ్మీర్ నేతల నుండి యూపిఏ ప్రభుత్వంపై ఒత్తిళ్లువచ్చాయి. దీంతో అఫ్జల్ గురు ఉరిశిక్షను వాయిదా వేస్తూ వచ్చారు. ఈ సందర్భంలోనే తనకు ఉరిశిక్ష వేస్తారా లేక క్షమాభిక్ష పెడతారా... ఏదో ఒక విషయం తేల్చాలని, అద్వానీ ప్రధాని అయ్యుంటే తన విషయాన్ని అటోఇటో తేల్చేవారని అఫ్జల్గురు పత్రికలకు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పడం జరిగింది. అఫ్జల్గురు ఉరి పెండింగ్లో వుండగానే, ముంబై దాడి జరగడం, అందులో నిందితుడు కసబ్కు కూడా ముంబై కోర్టు ఉరిశిక్ష విధించడం, దానిని సుప్రీంకోర్టు సమర్థించడం జరిగిపోయాయి. అయితే కసబ్కు ఉరిశిక్ష అమలు చేసే విషయంలో కూడా కేంద్ర ప్రభుత్వం నీళ్లు నమలసాగింది. కసబ్ను జైలులో పెట్టి మేపడానికి 38కోట్లు ఖర్చుపెట్టింది. దీనిమీద సర్వత్రా విమర్శలు రాసాగాయి. పార్లమెంట్పై దాడి విషయంలో ప్రాణాలు కోల్పోయిన సాయుధ పోలీసులకు ఇచ్చిన శౌర్య పతకాలను సైతం అఫ్జల్గురుకు ఉరిశిక్ష వేసేదాకా మేం తీసుకోబోమంటూ వారి కుటుంబసభ్యులు తెచ్చి యూపిఏ ప్రభుత్వం ముఖాన కొట్టారు.

2014లో కాదు ఈ ఏడాదిలోనే ఎన్నికలొచ్చే అవకాశాలున్నాయి. యూపిఏ-2లో సాధించిన అద్భుత విజయాలేవీ లేవు రేపు ఎన్నికలలో చెప్పుకోవడానికి. అన్నీ వైఫల్యాలే. వాళ్లు ఘనంగా చెప్పుకోగలిగిన ఘనకార్యాలు కసబ్, అఫ్జల్గురు ఉరిశిక్షలే! వీళ్ల రాజకీయ స్వార్థానికైనా వాళ్లకు ఉరిశిక్ష విధించడం శాంతిని కాంక్షిస్తూ, ఉగ్రవాదాన్ని ద్వేషించే 120కోట్ల మంది భారతీయులకు శుభవార్తే!

## 'అంతర్'జాతీయం

- ప్రపంచవ్యాప్తంగా ఉన్న 110కోట్ల మంది రోమన్ క్యాథలిక్లకు ప్రతినిధి దైవసందేశ దూత పోప్ బెనడిక్ట్-16 తన పదవికి రాజీనామా చేస్తునట్లు ప్రకటించారు. వృద్ధాప్యం కారణంగానే తాను ఈనెల 28న రాజీనామా చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. గత 600 ఏళ్లలో ఒక పోప్ రాజీనామా చేయడం ఇదే మొదటిసారి.
- శ్రీలంక అధ్యక్షుడు మహేంద్ర రాజపక్సే తన భార్య షిరంతితో కలిసి ఈ నెల 9న తిరుమలలో శ్రీవారిని దర్శించుకున్నారు. రాజపక్సే రాకను నిరసిస్తూ తమిళులు ఆందోళనా కార్యక్రమాలు నిర్వహించారు.
- పవిత్ర మహాకుంభమేళాలో అంతులేని విషాదం చోటుచేసుకుంది. 9వ తేదీ అర్ధరాత్రి అలహాబాద్ రైల్వేస్టేషన్లో జరిగిన తొక్కిసలాటలో 37మంది మృతిచెందారు. అలహాబాద్లోని త్రివేణీ సంగమంలో పుణ్యస్నానాల కోసం దాదాపు 3కోట్ల మంది భక్తులు వచ్చారు. దీంతో రైల్వేస్టేషన్లో తీవ్ర రద్దీ నెలకొంది. ఒక ప్లాట్ఫాంపైకి రావాల్సిన రైలు మరో ప్లాట్ఫాంపైకి వస్తుందని అప్పటికప్పుడు అనౌన్స్ చేయడంతో ప్రయాణీకులు గుంపులుగుంపులుగా కాలివంతెన ఎక్కారు. ఈ తొక్కిసలాటలో వంతెన రెయిలింగ్ కూలిపోవడంతో ప్రమాదం చోటుచేసుకుంది. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం మృతుల కుటుంబాలకు 5లక్షల రూపాయల వంతున ఎక్స్గ్రేషియా ప్రకటించింది.
- వన్యప్రాణుల సంరక్షణ చట్టం - 1972 ప్రకారం పులులకు, చిరుత పులులకు అత్యున్నత స్థాయి రక్షణ వుందని, మనుషుల ప్రాణాలకు అవి ముప్పుగా మారితే మాత్రం చంపేయవచ్చని జాతీయ పులుల సంరక్షణ సంస్థ స్పష్టం చేసింది.
- బెయిల్ పొందడానికి అవకాశం వున్న చిన్నచిన్న కేసుల్లో కూడా బెయిల్ పొందలేక దీర్ఘకాలంగా జైళ్లలో మగ్గుతున్న విచారణ ఖైదీలకు విముక్తి కల్పించాలని కేంద్ర ప్రభుత్వం సంకల్పించింది. ఈమేరకు అన్ని రాష్ట్రాలకు సూచనలు జారీ చేసింది.
- ఈ ఏడాది అమర్నాథ్యాత్రికుల వయసుకు సంబంధించి శ్రీ అమర్నాథ్జీ ఆలయ బోర్డు అధికారులు కొన్ని మార్పులు చేసారు. 13ఏళ్లలోపు వారిని 75ఏళ్లు పైబడిన వారిని యాత్రకు అనుమతించకూడదని నిర్ణయించారు.

## వార్త వ్యాఖ్య

వార్త :- మైనార్టీలకు 15స్థానాలు కేటాయించాలి.
- చంద్రబాబుతో మైనార్టీ సెల్ నేతలు.

వ్యాఖ్య :- ***కులాలు, మతాల కోటా ప్రకారం చూస్తే మొత్తం వున్న 294సీట్లు కూడా సరిపోయేటట్టు లేవే!***

వార్త :- రిజర్వేషన్లు తగ్గిస్తే ఎన్నికలు జరగనివ్వం. - బీసీ నేత కృష్ణయ్య.

వ్యాఖ్య :- ***ఇప్పుడు ప్రభుత్వానికి కావాల్సింది కూడా అదే!***

వార్త :- వారంలో మరో కుంభకోణం వెలుగులోకి. - సుబ్రహ్మణ్యస్వామి.

వ్యాఖ్య :- ***వారందాకా ముహూర్తం లేదా?***

వార్త :- సీమాంధ్రుల వల్లే హైదరాబాద్ అభివృద్ధి. - ఎంపీ రాయపాటి.

వ్యాఖ్య :- ***ఆ పరంపరలో వీళ్లూ అభివృద్ధి చెందారుగా!***

వార్త :- తెలుగులో కనిపించాలి, వినిపించాలి.
- తెలుగు న్యాయపాలన సదస్సులో ముఖ్యమంత్రి.

వ్యాఖ్య :- ***ముందు మీరు తెలుగులో మాట్లాడాలి!***

వార్త :- చెంప పగలగొడతా! - ఫోటో జర్నలిస్టులపై నోరుజారిన మమత.

వ్యాఖ్య :- ***మీ వద్దకు రావాలంటే చెంపల మీద చేతులు పెట్టుకుంటే మంచిదేమో!***

వార్త :- అఫ్జల్కు ఉరి అన్యాయం. - జమ్మూకాశ్మీర్ సీఎం ఒమర్.

వ్యాఖ్య :- ***అతను చేసిన పార్లమెంట్పై దాడి న్యాయమంటారా?***

వార్త :- లోక్సభకు ముందస్తు ఎన్నికలు. - బీజేపీ నేత వెంకయ్య జోస్యం.

వ్యాఖ్య :- ***అధికారంలోకి రావడానికి తెగ తొందరపడుతున్నారే...!***

వార్త :- రాష్ట్ర పరిస్థితులపై ఉద్వేగం అవసరం లేదు. - గవర్నర్.

వ్యాఖ్య :- ***ఇప్పుడే ఏమీ తేల్చరంటారా?***

వార్త :- రైలు టిక్కెట్లపై సర్ఛార్జీ.

వ్యాఖ్య :- ***మా కిరణ్కుమార్రెడ్డిని స్ఫూర్తిగా తీసుకున్నట్లున్నారు.***

వార్త :- టీడీపీని నమ్మొద్దు. - కోదండరాం.

వ్యాఖ్య :- ***తెలంగాణకు మద్దతు పలికారు కాబట్టా?***

PDF Compressor Free Version



# భయం.. భయం...

(మొదటిపేజీ తరువాయి)

ఇంట్లో వున్న వారికీ భద్రత లేదు... వీధుల్లో తిరిగేవారికీ భద్రత లేదు. దారిలో వెళుతున్న మహిళల మెడల్లో ఆభరణాలు లాక్కెళ్లడం దగ్గర నుండి ఇళ్లల్లో వరుస దోపిడీలు, అక్రమసంబంధాల నేపథ్యంలో హత్యలు వంటి నేరాలకు అడ్డుఅదుపు లేకుండా పోయింది. ప్రశాంతతకు మారు పేరైన నెల్లూరుజిల్లా ఇప్పుడు నేరాల ఖిల్లాగా మారిపోయింది. నాలుగురోజుల వ్యవధిలోనే జిల్లాలో చోటుచేసుకున్న రెండు దారుణ ఉదంతాలు జిల్లాలో పెరిగిన నేరతీవ్రతకు, దిగజారిన శాంతిభద్రతలకు అద్దం పడుతున్నాయి. దుత్తలూరు మండలం సోమలరేగడలో ఒక కుటుంబంపై కిరాతకశక్తులు చేసిన దాడిలో ఇద్దరు చిన్నారులతో పాటు వారి తల్లిదండ్రులు కూడా హతమైన సంఘటన ప్రజలలో భయాందోళనలు రేకెత్తిస్తున్న తరుణంలో 12వ తేదీ మంగళవారం పట్టపగలే నెల్లూరు నగరంలోని హరనాథపురం 2వ వీధిలో చోటుచేసుకున్న దారుణ ఉదంతం ప్రజలను దిగ్భ్రాంతికి గురిచేసింది. విలాసాలను మరిగిన పాతికేళ్ల కూడా నిండని యువకులు నగదు, నగలు దోచుకోవడమే లక్ష్యంగా చేసిన దాడిలో ఒక వైద్య విద్యార్థినితో పాటు ఆమె తల్లి కూడా ప్రాణాలు కోల్పోవడం అరాచకశక్తుల స్వైరవిహారానికి అద్దం పడుతుంది. మితిమీరిన నేరాలతో విసుగెత్తిన ప్రజలు నిందితులను అక్కడికక్కడే ఎన్‌కౌంటర్ చేసి శిక్షించాలంటూ నిరసన వ్యక్తం చేయడం వారిలో నెలకొన్న ఆవేశాన్ని, ఆవేదనను ప్రస్ఫుటం చేస్తుంది.

**నెల్లూరులో దారుణం...**

ఒకప్పుడు నెల్లూరుజిల్లా అంటే పచ్చని పంటపొలాలు... గలగలపారే పెన్నా పరవళ్ళు... ప్రశాంత వాతావరణానికి పేరు. రాష్ట్రంలో, దేశంలో ఎక్కడినుంచైనా నెల్లూరు వస్తే తిరిగిపోవడానికి మనసు అంగీకరించేది కాదు. ఇక్కడే స్థిరనివాసం ఏర్పరచుకొని ఏదో ఒక పనిపాటా చేసుకుని జీవించాలని ఉవ్విళ్ళూరేవారు. కాని నేడు ఆపరిస్థితిలేదు. జిల్లాలో విచ్చలవిడిగా దొంగతనాలు, దోపిడీలు, కిడ్నాప్‌లు, హత్యలకు నిలయమైంది. డబ్బు కోసం పసిబిడ్డలు, మహిళలు అని కూడా చూడకుండా క్రూరప్రాయంగా హత్యలు చేస్తున్నారు. గత ఏడాదిగా ఈ దారుణాలు జిల్లాలో ఎక్కువయ్యాయి.

దుత్తలూరు మండలం సోమలరేగడలో జరిగిన నరమేధాన్ని జిల్లా ప్రజలు మరచిపోకముందే నగరంలో మరో దారుణం జరిగింది. పట్టపగలు హరనాథపురం రెండవవీధిలోని రామాలయం సమీపంలో మంగళవారం ముగ్గురు యువకులు ఇంట్లోకి చొరబడి తల్లి, కుమార్తెను కిరాతకంగా హత్యచేయడం సంచలనం సృష్టించింది. ఈ ప్రాంతంలో వాగ్దేవి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ దినకర్‌రెడ్డి, భార్య శకుంతల, కుమార్తె భార్గవిరెడ్డితో కలసి నివసిస్తున్నారు. దినకర్‌రెడ్డి స్వగ్రామం ప్రకాశంజిల్లా సింగరాయకొండ. దినకర్‌రెడ్డి 2002లో చెన్నైలోని మహారాజా ఫార్మసీ కళాశాలలో పనిచేస్తూ నెల్లూరుకు మకాం మార్చారు. 2005లో నెల్లూరులో ఫార్మసీ కళాశాలను ఏర్పాటు చేశారు. వీరి ఒక్కగానొక్క కుమార్తె భార్గవి నారాయణ మెడికల్ కళాశాలలో నాల్గవ సంవత్సరం మెడిసిన్ చదువుతోంది. ఈ నేపథ్యంలో దినకర్‌రెడ్డి విధులకు వెళ్ళగా ఆయన భార్య శకుంతల, కుమార్తె భార్గవి ఇంట్లోనే ఉన్నారు. మంగళవారం మధ్యాహ్నం 12గంటల సమయంలో ఇంటీరియర్ డిజైనింగ్ వర్క్ నిర్వహించే ఇంతియాజ్, ఇతని ఇద్దరు స్నేహితులు మురళీ మనోహర్ కుమార్, వంశీకృష్ణతో కలసి దినకర్‌రెడ్డి ఇంటికి వచ్చారు. పరిచయస్తులు కావడంతో శకుంతల వారిని ఇంట్లో కూర్చోబెట్టి టీ కూడా ఇచ్చింది. సార్ కోసం వచ్చామని చెప్పిన ఈ కిరాతకులు టీ తాగాకా తమ దుర్మార్గపు ఆలోచనకు శ్రీకారం చుట్టారు. టీ ఇచ్చిన శకుంతలను కత్తితో పొడిచారు. ఆమె కేకలు వేయడంతో బెడ్‌రూంలో చదువుకుంటున్న భార్గవి పరుగెత్తుకుంటూ హాల్‌లోకి వచ్చింది. ఈ దుర్మార్గులు భార్గవిని కత్తిచూపి బెదిరించి బెడ్‌రూమ్‌లో వున్న బీరువా తాళాలు తెరిపించి నగలు, నగదు దోచుకున్నారు. ఈ సమయంలో గాయాలై కూడా తన కూతురిని ఈ దుర్మార్గులు ఏమి చేస్తారోననే ఆవేదనతో బెడ్‌రూంలోకి వచ్చి అడ్డుకున్న శకుంతలను మరోసారి పొడిచి చంపారు. తర్వాత తమను ఎక్కడ గుర్తుపడుతుందోనని ఇంతియాజ్ భార్గవి గొంతు నులిమేయగా మిగతా ఇద్దరూ ఆమె కాళ్లు పట్టుకుని పాశవికంగా హత్యచేశారు. వారి శరీరంపై ఉన్న బంగారాన్ని దోచుకొని పారిపోబోతున్న సమయంలో శకుంతల బంధువు లీలా అనే మహిళ రావడంతో బెడ్‌రూంలో దాక్కున్నారు. కాలింగ్‌బెల్ నొక్కినా ఎంతసేపటికి సమాధానం రాకపోవడంతో తన సోదరుడు దినకర్‌రెడ్డికి ఫోన్‌చేసింది. కాసేపటికి దినకర్‌రెడ్డి తన కళాశాలలో పనిచేసే ప్రవీణ్‌కుమార్‌రెడ్డి అనే వ్యక్తితో కలసి ఇంటికి వచ్చారు. తలుపులు రాకపోవడంతో ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, దినకర్‌రెడ్డి వెనుకవైపు నుంచి వెళ్ళేందుకు ప్రయత్నించారు. లోపల నుంచి అంతా గమనిస్తున్న ముగ్గురు దుండగులు తలుపు ప్రక్కనే నక్కి వీరిపై పెప్పర్‌స్ప్రే(కారప్పొడి లాంటి రసాయనం)ను వారి కళ్ళల్లో చల్లి కత్తులతో దాడిచేశారు. ఈ హఠాత్ పరిణామంతో దిగ్భ్రాంతి చెందిన వాళ్ళు పెద్దగా కేకలు వేశారు. దీంతో స్థానికులు గుమికూడి వెనువెంటనే పోలీసులకు, 108 సిబ్బందికి సమాచారం అందించారు. మొదట ఇంతియాజ్ మొదటి అంతస్తు నుంచి కిందికి దూకి పారిపోయే ప్రయత్నం చేస్తూ తాను దొంగను కానని, దొంగలు పైన వున్నారని చెప్పాడు. అయితే కిందపడ్డ అతని జేబులో నుండి నగలు బయట పడడంతో స్థానికులు పట్టుకుని దేహశుద్ధిచేసి పోలీసులకు అప్పగించారు. మిగతా ఇద్దరు నిందితులు ఇంటిలోనే బాత్‌రూంలో దూరి గడిపెట్టుకున్నారు. అప్పటికే ఇక్కడకు చేరుకున్న పోలీసులు చేతిలో తుపాకులు లేకపోవడంతో ఇంట్లోకి వెళ్లడానికి కొంచెంసేపు తటపటాయించారు. కొద్దిసేపటికి నాల్గవనగర సిఐ రామారావు రివాల్వర్ తీసుకుని ఇంట్లోకి ప్రవేశించారు. బాత్‌రూంలో వున్న ఇద్దరు నిందితులకు తుపాకి గురిపెట్టి బయటకు రాకుంటే కాల్చేస్తామని హెచ్చరించడంతో మురళీమనోహర్‌కుమార్, వంశీకృష్ణలు బయటకు వచ్చారు. పోలీసులు వెంటనే వారిని అదుపులోకి తీసుకున్నారు. జరిగిన సంఘటన తెలిసి అప్పటికే వేలాదిమంది ప్రజలు అక్కడికి చేరారు. నిందితులను ఎన్‌కౌంటర్ చేయాలని, లేదంటే తమకు అప్పగిస్తే ఆ పనేదో తాము చేస్తామని ప్రజలు నినదించారు. ప్రజల ఆవేశాన్ని అర్థం చేసుకున్న పోలీసులు అప్రమత్తంగా వుండి నిందితులను తగు జాగ్రత్తల మధ్య పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. గాయపడ్డ దినకర్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్‌రెడ్డిని ఆసుపత్రికి తరలించారు. సంఘటనాస్థలానికి జిల్లా అదనపు ఎస్పీలు, ఎల్‌టి చంద్రశేఖర్, ఏసి నాగేశ్వరరావు, డిఎస్పీ వెంకనాథ్‌రెడ్డి సిఐలు, ఎస్సైలు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు.

**మెడిసిన్‌లో భార్గవి గోల్డ్‌మెడలిస్ట్..**

భార్గవిరెడ్డి మంచి విజ్ఞానం కలదని మెడిసిన్‌లో మొదటి మూడు సంవత్సరాలు యూనివర్శిటీ స్థాయిలో గోల్డ్‌మెడల్ సాధించిందని ఆమె స్నేహితులు ఈ సందర్భంగా కన్నీరుమున్నీరై తెలిపారు. భార్గవిరెడ్డికి మెడిసిన్ సీటు తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలలో రాగా తల్లిదండ్రులు కుమార్తెను అంతదూరం పంపలేక నారాయణ కళాశాలలో మేనేజ్‌మెంట్ కోటాలో చేర్పించి చదివిస్తున్నట్లు మృతురాలి బంధువులు తెలిపారు.

**దుండగుల్లో ఇద్దరు విద్యార్థులు..**

ఈ దారుణానికి పాల్పడ్డ ముగ్గురు దుండగుల్లో ఇద్దరు విద్యార్థులై ఉండడం విశేషం. వీరు బాలాజీనగర్ ప్రాంతానికి చెందిన వారుగా గుర్తించారు. మురళీ మనోహర్‌కుమార్ ఇంటర్ చదువుతుండగా, వంశీకృష్ణ పాలిటెక్నిక్ కళాశాలలో చదువుతున్నారు. ఈ హత్యలకు కారణమైన ఇంతియాజ్ నగరంలోని ట్రంకురోడ్డు ఆర్‌ఆర్ వీధిలో ఒక భవనంలో నిర్వహిస్తున్నాడని పోలీసులు తెలిపారు.

**డబ్బు కోసం..**

దినకర్‌రెడ్డి ఇంటికి ఫార్మసీ కళాశాలకు ఇంతియాజ్ ఇంటీరియర్ డిజైనింగ్, ఎలివేషన్ డిజైనింగ్ చేశారు. ఈ సమయంలోనే దినకర్‌రెడ్డి ఇంట్లో దాస్తున్న నగదు, నగల వివరాలను తెలుసుకున్నాడు. శకుంతల ఒంటరిగా వున్నప్పుడు ఆమెను హత్యచేసి వాటిని దోచుకోవాలనుకుని ప్రణాళిక వేసుకున్నాడు. అయితే మంగళవారం భార్గవి కూడా ఇంట్లోనే వుండడంతో ఈ కిరాతకులు ఇద్దరినీ చంపేశారు.

**రెక్కీ..**

ఈ హత్యలకు పాల్పడ్డ ముగ్గురు దుండగులు ఆరునెలలుగా రెక్కీ నిర్వహించారని జిల్లా ఎస్పీ బివి రమణకుమార్ తెలిపారు. ప్రధాన నిందితుడు ఇంతియాజ్‌ను అదుపులోకి తీసుకుని తమదైన స్టైల్లో ప్రశ్నించిన అనంతరం మరికొన్ని కొత్త విషయాలు బయటకు వచ్చాయన్నారు. ఇంతియాజ్, దినకర్‌రెడ్డి ఇంటికి, కళాశాలకు, డిజైనింగ్ పనిచేస్తున్నపుడు కాలేజీలో ఫీజుల క్రింద వసూలైన లక్షరూపాయలు, ఇంటి వద్ద గమనించిన లక్షల రూపాయలను దోచుకొని డైరీవ్యాపారం చేయాలని కలలు కన్నట్లు తెలిపాడని ఎస్పీ విలేకర్లకు తెలిపారు.

**సోమలరేగడలో.. పెనువిషాదం..**

నెల్లూరుజిల్లా దుత్తలూరు మండలం సోమలరేగడలో శ్మశాన నిశ్శబ్దం చోటు చేసుకుంది. గ్రామంలో జరిగిన సంఘటనలు తలుచుకుని శోకసముద్రంలో మునిగిపోయారు. 9వ తేదీ అర్ధరాత్రి దాటిన తర్వాత ఒకే కుటుంబంపై దాడి జరిగిన సంఘటనలో ముగ్గురు ఊచకోతకు గురికాగా ఆదివారం చికిత్స పొందుతూ చిన్నారి సోమశేఖరరెడ్డి(10) వైద్యశాలలో మృతిచెందాడు. వివరాల్లోకి వెళితే సోమలరేగడకి చెందిన బి.రాధాకృష్ణారెడ్డి, స్థానిక రాజకీయాల్లో చురుగ్గా పాల్గొనేవాడు. గ్రామానికి కొంతదూరంలో తన సొంత భూమిలో ఇల్లు నిర్మించుకుని, పాడి పరిశ్రమ ఏర్పాటుచేసుకుని జీవిస్తున్నాడు. ఈ నేపథ్యంలో ఈమధ్య జరిగిన పాల సొసైటీ సహకార సంఘ ఎన్నికల్లో రాధాకృష్ణారెడ్డి, వైసిపికి చెందిన అభ్యర్థికి మద్దతు పలికి ప్రచారంలో తిరిగాడు. రాధాకృష్ణారెడ్డికి స్వయాన పెదనాన్న కుమారుడు కాంగ్రెస్ అభ్యర్థిగా రంగంలో ఉన్నాడు. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్, వైసిపికి సరిసమానంగా ఓట్లు వచ్చాయి. దీంతో లాటరీవేశారు. అందులో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపొందాడు. దీంతో రాధాకృష్ణారెడ్డి కుటుంబసభ్యులు మూడు ఓట్లు వైసిపికి మద్దతు ఇస్తున్నట్లు నటించి ఓట్లు మాత్రం కాంగ్రెస్ అభ్యర్థికి వేసినట్లు కొంతమంది వైసిపి నేతలు నిలదీసినట్లు సమాచారం. ఈ విషయంలో కొంతమంది ఇతడిపై కక్షకట్టి ఈ దారుణానికి పాల్పడివుంటారని పోలీసుల అనుమానిస్తున్నారు. 9వ తేదీ రాధాకృష్ణారెడ్డి పనినిమిత్తం దుత్తలూరుకు వెళ్ళి తిరిగి సాయంత్రం ఇంటికి చేరాడు. రాధాకృష్ణారెడ్డితో పాటు ఇంట్లో ఆయన తండ్రి వెంకటసుబ్బారెడ్డి, భార్య రమాదేవి, కూతురు ఝాన్సీ, కుమారుడు సోమశేఖర్ రెడ్డి ఉన్నారు. అర్ధరాత్రి దాటిన తర్వాత హంతకులు ఆ ఇంటికి విద్యుత్ సరఫరా తీసివేశారు. రాధాకృష్ణారెడ్డి ఆయన భార్య ఇద్దరు పిల్లలు ఇంట్లో పడుకుని ఉండగా, తండ్రి సుబ్బారెడ్డి ఆరుబయట నిద్రపోతున్నాడు. హంతకులను పసిగట్టిన కుక్క అరుస్తున్నా ఆరుబయట నిద్రపోతున్న సుబ్బారెడ్డి అంతగా పట్టించుకోలేదు. ఒక్కసారిగా నలుగురు వ్యక్తులు వచ్చి తొలుత సుబ్బారెడ్డిని కత్తితో నరికారు. అతను పెద్దగా కేకలు వేయడంతో ఇంట్లో ఉన్న రాధాకృష్ణారెడ్డి బయటకు వచ్చిన వెంటనే కత్తులతో దాడిచేశారు. అక్కడికక్కడే అతను కుప్పకూలిపోయాడు. వెంటనే ఇంట్లోకి జొరబడి భార్య రమాదేవి, కుమార్తె ఝాన్సీని నరికారు. వారు అక్కడికక్కడే మృతిచెందారు. కుమారుడు సోమశేఖర్ రెడ్డికి బలమైన గాయాలై స్పృహతప్పిపడిపోయాడు. ఈ ఘాతుకచర్య అరగుంటలోపే జరిగిపోయింది.

**హత్యా ప్రదేశాన్ని పరిశీలించిన జిల్లా ఎస్పీ**

హత్యలు జరిగిన ప్రదేశాన్ని జిల్లా ఎస్పీ బివి రమణకుమార్ సోమవారం పరిశీలించారు. దాడులు జరిగిన ప్రదేశాలు, రమాదేవి, ఝాన్సీలక్ష్మిల మృతదేహాలు పడి వున్న మంచాలను ఎస్పీ క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం రాధాకృష్ణారెడ్డి బంధువుల నుంచి వివరాలు సేకరించారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ తాను వైద్యశాలలో చికిత్స పొందుతున్న రాధాకృష్ణారెడ్డితో మాట్లాడడం జరిగిందని, ఈ ఘాతకానికి పాల్పడిన కొంతమంది బంధువుల పేర్లను చెప్పడం జరిగిందన్నారు.

# బెంగాల్ టైగర్

(మొదటిపేజీ తరువాయి)

పశ్చిమబెంగాల్ రాష్ట్రం నుండి ఎందరో పోరాటయోధులు వచ్చారు. ఆ నేల మహిమేమో, ఆ నీళ్ల ఫలమేమోగాని స్థిరత్వం, దృఢత్వం వున్న నాయకులు ఎక్కువగా ఇక్కడ నుండే రావడం విశేషం. ప్రస్తుతం మన రాష్ట్రపతి ప్రణబ్‌ముఖర్జీ కూడా బెంగాలీయుడే! ఆయన రాష్ట్రపతి అయ్యాకనే దేశంలో రెండు దృఢమైన నిర్ణయాలు వెలువడ్డాయి. ముంబై మారణకాండలో 160మందిని పొట్టనపెట్టుకున్న క్రూరుడు అజ్మల్ అమీర్ కసబ్ క్షమాభిక్ష పిటీషన్‌ను ఆయన ఏ మాత్రం ఆలస్యం చేయకుండా తిరస్కరించాడు. గత ఏడాది నవంబర్‌లో కేంద్ర హోంశాఖకు తప్ప, కేంద్రప్రభుత్వాన్ని శాసించే సోనియాగాంధీకి సైతం తెలియకుండా కసబ్‌ను నాగపూర్‌జైలులో ఉరితీయడం తెలిసిందే!

తాజాగా పార్లమెంట్‌పై దాడి కేసు నిందితుడు అఫ్జల్‌గురు క్షమాభిక్ష విషయంలో సైతం ఆయన అదే దృఢవైఖరిని చాటారు. క్షమాభిక్ష పిటీషన్‌ను తిరస్కరించి రాజ్యాంగ ప్రతినిధిగా రాష్ట్రపతి పదవికి వున్న విలువను కాపాడారు. దేశసార్వభౌమత్వాన్ని ప్రశ్నించిన కిరాతక చర్యను ఎట్టి పరిస్థితుల్లోనూ క్షమించేది లేదని ఆయన చాటిచెప్పారు.

కసబ్, అఫ్జల్‌గురు ఉరి నిర్ణయాలను రాష్ట్రపతి ప్రణబ్ ఇంకెవరితోనూ చర్చించలేదని తెలుస్తుంది. కాంగ్రెస్‌పార్టీ మద్దతుతో ఆయన రాష్ట్రపతిగా ఎన్నికైనప్పటికి ఈ క్షమాభిక్ష పిటీషన్‌లను తిరస్కరించే విషయంలో మాత్రం ఆయన తన వ్యక్తిగత హోదాను కాపాడుకున్నారు. ప్రణబ్ కాకుండా ఆయన స్థానంలో కాంగ్రెస్ అధిష్టాన విధేయులు ఇంకెవరున్నా కసబ్, అఫ్జల్‌గురులకు ఇప్పట్లో శిక్షలు అమలైవుండేవి కావని చర్చ జరుగుతుంది.

# అభాసుపాలౌతాం

(మొదటిపేజీ తరువాయి)

ఈరోజు ప్రజలు న్యాయస్థానాలను నమ్ముతున్నంతగా మరే వ్యవస్థను నమ్మడంలేదు. రాజకీయాలకతీతంగా వ్యవహరించాలని న్యాయమూర్తులు ఎంతగా ప్రయత్నిస్తున్నా, చట్టాలలో వున్న లొసుగులను ఉపయోగించుకుని న్యాయవ్యవస్థలపై కూడా ప్రభావం చూపేందుకు అధికారంలో వున్న రాజకీయపార్టీలు ప్రయత్నిస్తూనే వున్నాయి.

అక్రమాస్తుల కేసులో దాదాపు 8నెలలుగా జైలులో వున్న వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు వైయస్ జగన్మోహన్‌రెడ్డికి బెయిల్ రాకుండా అధికారపార్టీ ఒత్తిళ్లు వున్నాయనే ప్రచారం జోరందుకున్న తరుణంలో న్యాయమూర్తులు అంతర్మథనంలో వున్నట్లు సమాచారం. దేశంలో ప్రజలందరికీ సమన్యాయం అందాలి. క్రూరమైన నేరాలు, లక్షలకోట్ల కుంభకోణాలు చేసిన నిందితులకు కూడా నిర్దిష్ట గడువులోపల న్యాయస్థానాలు బెయిల్ ఇచ్చివున్నాయి. జగన్ దావూద్ ఇబ్రహీం లాగా అంతర్జాతీయ నేరస్థుడు కాదు. భారతీయ పౌరుడు. మరి ఆయనను కేసుల విచారణ పేరుతో ఇన్ని నెలలు జైలులో ఉంచాల్సిన అవసరమేమిటని ప్రజలే ప్రశ్నిస్తున్నారు. బెయిల్ పొందడం అనే హక్కును అందరూ వినియోగించుకుంటారు. జగన్ కూడా రాజ్యాంగం తనకు కల్పించిన హక్కుల ద్వారా బెయిల్ పొందే అవకాశమున్నా, ఎన్నో చట్టాలను అతని మీద ప్రయోగించి బెయిల్ రాకుండా చేస్తున్నారు. కాంగ్రెస్ అధిష్టానం, రాష్ట్ర ప్రభుత్వం సిబిఐని అడ్డం పెట్టుకుని న్యాయవ్యవస్థ మీద ప్రభావం చూపిస్తూ జగన్‌కు బెయిల్‌రాకుండా చేస్తున్నారనే విమర్శలు ఎక్కువవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇటీవల కొందరు న్యాయమూర్తులు సమావేశమై అంతర్గతంగా జగన్ బెయిల్ వ్యవహారాన్ని చర్చించినట్లు విశ్వసనీయ వర్గాల భోగట్టా! మన దేశంలో ప్రజలు మనమీదే నమ్మకం పెట్టుకుని వున్నారు. ఈ నమ్మకాన్ని మనం కాపాడుకోవాల్సి వుంది. న్యాయవ్యవస్థకింకా రాజకీయ అంటువ్యాధి సోకలేదు. ముందు కూడా అంటకుండా చర్యలు తీసుకోవాలి. రాజకీయాలకు, రాగద్వేషాలకు అతీతంగా మనం వ్యవహరించాల్సివుంది. చట్టం దృష్టిలో అందరూ సమానులే అన్నదానిని ఆచరణలో చూపించాల్సివుంది. కాబట్టి జగన్ విషయంలో చట్టప్రకారం నిర్ణయం తీసుకోవాలని న్యాయమూర్తులు అనుకున్నట్లు తెలుస్తుంది. రాజకీయ ఒత్తిళ్లను పక్కనపెట్టి న్యాయస్థానాలు చట్టాల ప్రకారం నిర్ణయం తీసుకుంటే సుప్రీంకోర్టు విధించిన నిర్దిష్ట గడువు పూర్తి తర్వాత జగన్‌కు బెయిల్ వచ్చే అవకాశముంది.

PDF Compressor Free Version





జిల్లా సహకారసంఘ ఎన్నికలలో నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో సొసైటీ డైరెక్టర్లుగా ఎంపికైన వైఎస్ఆర్‌సీపీ నాయకులను అభినందిస్తున్న నెల్లూరు ఎంపి మేకపాటి రాజమోహన్‌రెడ్డి ప్రక్కన కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, అనిల్‌కుమార్, పి.రూప్‌కుమార్, తాటి వెంకటేశ్వర్లు తదితరులు.

# నెల్లూరు కబుర్లు

## ఈ మాసమే కిరణ్ రాక



ఇప్పటికే పలుమార్లు వాయిదాపడుతూ వచ్చిన ముఖ్యమంత్రి ఎన్. కిరణ్‌కుమార్‌రెడ్డి జిల్లా పర్యటన ఈ నెల 22, 23తేదీలలో వుండే అవకాశముంది. అప్పటికి జిల్లాలో డీసీసీబీ, డీసీఎంఎస్ పాలకవర్గాల ఎంపిక కూడా పూర్తై నాయకులు, అధికారులు తీరిగ్గా వుంటారు. సీఎం పర్యటన నేపథ్యంలో అధికారులు తమ ఏర్పాట్లను కొనసాగిస్తూనే వున్నారు. చాలా అభివృద్ధి పనులకు శిలాఫలకాలను, వాటి మీద పేర్లను చెక్కించివున్నారు. తేదీలనే చెక్కించాల్సి వుంది. సీఎం పర్యటన ఖరారైతే ఆ పని కూడా పూర్తి చేస్తారు.

## నకిలీ సిడిల పట్టివేత

ఆదివారం నెల్లూరు డిఎస్పీ వెంకటనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఐడి పార్టీ సిబ్బంది మూలాపేటలోని ఓ నకిలీ సిడిల తయారీ కేంద్రంపై దాడిచేసి 1500 పైరసీ సీడీలను, 5వేల సిడి, డివిడిల ర్యాపర్లను, ఇతర పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో షేక్‌మన్సూర్ అలీఖాన్‌ను అరెస్ట్ చేశారు. రామయ్యబడి పక్క సందులో వుండే అలీఖాన్ పటౌడి గత కొన్నేళ్లుగా పైరసీ సీడీలను తయారు చేసి మార్కెట్‌లో అమ్ముతున్నాడు. కొత్త సినిమా విడుదలైనరోజే చెన్నై నుండి ఆన్‌లైన్ పాస్‌వర్డ్ ద్వారా సినిమాలను డౌన్‌లోడ్ చేసి వేలల్లో వాటి సిడిలను, డివిడిలను తయారుచేసేవాళ్ళు. వీటిని సిడి పాయింట్లకు అమ్మేవాళ్ళు. పోలీసుల దాడుల్లో మిర్చి, సీతమ్మవాకిట్లో సిరిమల్లె చెట్టు, నాయక్, ఒంగోలుగిత్త, విశ్వరూపం, దండుపాళ్యెం వంటి కొత్తసినిమాల డివిడిలు పెద్దసంఖ్యలో దొరకడం విశేషం.

## శ్వేతకు జాతీయస్థాయి బహుమతి



జాతీయస్థాయి వ్యాసరచన పోటీల్లో నెల్లూరులోని నారాయణ జూనియర్ కళాశాల విద్యార్థిని శ్వేత ప్రథమస్థానంలో నిలిచింది. శ్రీరామచంద్రమిషన్ నిర్వహించిన ఈ పోటీలో "భవిష్యత్తులో నీవేం కావాలనుకుంటున్నావ్" అనే అంశంపై రాసిన పరీక్షకు శ్వేత ఈ బహుమతి సాధించింది. నెల్లూరు గాయత్రీనగర్‌లోని శ్రీరామచంద్ర మిషన్ కార్యాలయంలో ఈనెల 9న జరిగిన కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి మువ్వా రామలింగం శ్వేతకు బహుమతి ప్రదానం చేసారు. కార్యక్రమంలో విక్రమసింహపురి విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ నాగేంద్రప్రసాద్ నారాయణ విద్యాసంస్థల జి.యం.విజయ భాస్కర్‌రెడ్డి రామచంద్రమిషన్ సభ్యులు మొదలగువారు పాల్గొన్నారు.

## చైనా ఉపరాయబారికి అభినందనలు



ఇటీవల చైనాలో భారత ఉపరాయబారిగా నియమితులైన కావలి పట్టణ వాస్తవ్యులైన బాల భాస్కర్‌కు ఈనెల 9న నెల్లూరులోని భక్తవత్సల నగర్‌లో పంచాయితీ ఇంజనీర్స్ అసోసియేషన్ సభ్యులు గౌరవ సత్కారం చేసారు. అసోసియేషన్ రాష్ట్ర సభ్యులు పెంచలయ్య బాలభాస్కర్ స్నేహితుడుకావడంతో కావలి నుంచి చెన్నై వెళుతున్న సందర్భంలో ఆయనను అసోసియేషన్ సభ్యులు వాసు, మున్వర్ తదితరులు అభినందించారు.

## జైలులో కల్యాణ వైభవం



ఆదివారం నెల్లూరులోని జిల్లా కేంద్ర కారాగారం గోవిందనామ స్మరణతో అలరారింది. ఆధ్యాత్మికానందంతో ఖైదీలు పులకించిపోయారు. వివిధ నేరాలతో జైలులో మగ్గుతున్న ఖైదీలు భక్తిపారవశ్యంతో తన్మయత్వం చెందారు. సింహపురి గోవింద మాల కమిటీ, కోలపర్తి రమేష్ మిత్రమండలి, కనకదుర్గ సేవాసమితి వారు ఈ ఖైదీల కోసంగా శ్రీవారి కళ్యాణాన్ని నిర్వహించారు. వేదపండితులు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారిని కళ్యాణ వేదికపై కొలువుదీర్చి అంగరంగ వైభవంగా కళ్యాణోత్సవాన్ని నిర్వహించారు. జైలు సూపరింటెండెంట్ రవికిరణ్, జైలు సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఖైదీ భక్తులకు నిర్వాహకులు ప్రసాదాలు పంపిణీ చేశారు.

## నెల్లూరుకీ పెళ్లికళ

ఫిబ్రవరి 13,14,15 తేదీలలో రాష్ట్రవ్యాప్తంగా 2లక్షల పెళ్లిళ్లు జరిగాయట. నెల్లూరులో కూడా ఏ సందులో చూసినా షామియానాలే... ఏ కళ్యాణ మండపంలో చూసినా భాజాభజంత్రీలు వేదమంత్రాలు, మంగళవాయిద్యాలే... ఏ రోడ్లో చూసినా ట్రాఫిక్‌జామే... మహిళల పట్టుచీరలు, ఆభరణాల తళుకుబెళుకులు, అతిథుల ఆగమనం... ఈ మూడు రోజులు నెల్లూరుకే పెళ్లికళ వచ్చేసినట్లయ్యింది. ఈ మాసంలో కేవలం మూడు రోజులే పెళ్లి ముహూర్తాలు వచ్చాయి. దీంతో ఒక్క నెల్లూరు నగరంలోనే వందలాది వివాహాలు జరిగాయి. చాలా మంది కళ్యాణ మండపాలు దొరకక పాఠశాల మైదానాలలో, దేవాలయాలలో, విశాలంగా వున్న మైదానాలలో తాత్కాలికంగా కళ్యాణ వేదికలు ఏర్పాటుచేసి వివాహాలు చేసుకున్నారు. ఒకేసారి అన్ని పెళ్లిళ్లు రావడంతో వేదపండితులకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. మంగళవాయిద్యాలు, క్యాటరర్స్‌కు డిమాండ్ పెరిగింది.

## డీసీసీబీకి ఎన్నికల అధికారులు

జిల్లా కేంద్ర సహకార బ్యాంకు, జిల్లా సహకార మార్కెటింగ్ సంఘం ఎన్నికలకు సంబంధించి అధికారులను నియమిస్తూ సహకార కమీషన్ రిజిస్ట్రార్ ఎస్. శ్రీ నరేష్ ఉత్తర్వులు జారీచేశారు. డిసీసీబీ ఎన్నికల అధికారిగా డిఎస్ఓ ఎస్.సుబ్బా రావు, మార్కెటింగ్ సొసైటీ ఎన్నికల అధి కారిగా నెల్లూరు డివిజన్ సహకార అధికారి సుధాభారతిని నియమించారు. ఈనెల 18వతేదీన ఈ ఎన్నికలు జరుగనున్నాయి.

త్రై అమావాస్య తేజస్సుతో...

## తల్పగిరి రంగనాథస్వామి



త్రై అమావాస్య సందర్భంగా ఈనెల 10న నెల్లూరులోని శ్రీ తల్పగిరి రంగనాథస్వామికి ప్రభాత సంధ్యా సమయాన తిరుమంజన సేవతో మొదలై విశేష పూజలు జరిగాయి. సాయం సంధ్యాసమయంలో సర్వాభరణాలతో, పుష్పమాలలతో అలంకరించబడిన రంగనాథుడు స్వర్ణగరుత్మంతునిపై కొలువుదీరి నగరవీధుల్లో విహరించాడు. తూర్పువీధి, గోపురం వీధుల ద్వారా నవాబుపేట వరకు ఊరేగుతూ భక్తులకు ఆనందం కలిగించాడు. ఆలయ కార్యనిర్వహణాధికారి పాయసం నాగేశ్వరరావు పర్యవేక్షణలో స్వామి వారికి ప్రీతిపాత్రమైన త్రై అమావాస్య పర్వదిన ఉత్సవం శోభాయామానంగా సాగింది.

## అడ్డుగోడతో అవస్థలెన్నో...

నగరంలోని రామలింగాపురం ముత్యాలపాళెంకు వెళ్ళే రోడ్డుకు అడ్డంగా వున్న గోడను వెంటనే తొలగించాలని సిపిఎం నగర కార్యదర్శి మాదాల వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సోమవారం 19వ డివిజన్ సిపిఎం కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. మాదాల మాట్లాడుతూ 60 అడుగుల రోడ్డుకు అడ్డుగా గోడను నిర్మించడంతో ముత్యాలపాళెం ప్రాంతవాసులు అవస్థలు పడుతున్నారు. దళితులు ఎక్కువగా నివసించే ఈ ప్రాంతంపై అధికారులు చిన్నచూపు చూస్తున్నారని, గోడ విషయంలో కోర్టు ఇచ్చిన తీర్పును వెంటనే అమలుచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్.శ్రీనివాసులు, జె.కె.పాణి, ప్రసాదరావు, మాలకొండయ్య, శీను, కాంతారావు, రద్దమ్మ, కవిత, పెంచలయ్య, ధర్మారావు, రవి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

● కుంభమేళా

## భక్తులకు అవస్థలు

అలహాబాద్‌లో జరుగుతున్న మహాకుంభమేళాకు వెళ్లడానికి జిల్లాలో చాలామంది భక్తులు ఆసక్తిచూపుతున్నారు. అయితే సరైన ప్రయాణవసతి లేక చాలామంది తమ ఆశను చంపుకుంటున్నారు. నెల్లూరు నుండి ఉత్తరప్రదేశ్‌కు పెద్దగా రైల్వే సౌకర్యం లేదు. చాలాతక్కువ రైళ్లు మాత్రమే వున్నాయి. వీటిలో సాధారణరోజులలో కూడా రిజర్వేషన్ దొరకడం కష్టం. అలాంటిది మహాకుంభమేళాకు కోట్ల సంఖ్యలో భక్తులు వెళుతుంటారు. వాటిలో రిజర్వేషన్ గగనమే. మహాకుంభమేళా నేపథ్యంలో ఉత్తరప్రదేశ్‌కు వెళ్లే అన్ని రైళ్లలో కూడా రెండు నెలలక్రితమే రిజర్వేషన్లు అయిపోయాయి. చెన్నై, రేణిగుంటల నుండి ప్రత్యేక విమానాలు నడిపినా సాధారణ భక్తులు అంత ఖరీదైన ప్రయాణం చేయలేరు. ఆ విమానాలలో కూడా టిక్కెట్లు దొరకడం గగనం అయ్యింది. ఇక బస్సుల్లోనో, కారుల్లోనో పోయే పరిస్థితి లేదు. అక్కడకు పోవడమే కాదు, తిరుగు ప్రయాణం కూడా పెద్ద సమస్య కావడంతో చాలామంది మహాకుంభమేళా యాత్రను విరమించుకున్నారు.

## పట్టుదలతో ఎదుగుదాం



బాలలనుద్దేశించి ప్రసంగిస్తున్న శ్రీనివాసులరెడ్డి

పట్టుదలే పెట్టుబడిగా, సంకల్పమే ఆయుధంగా 'క్యాప్' చిన్నారులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఐఎఫ్ఎస్ అధికారి శ్రీనివాసులరెడ్డి ఉద్బోధించారు. అంధుడైన శ్రీనివాసులు రెడ్డి ఆత్మవిశ్వాసంతో చదివి సివిల్స్‌కు ఎంపికకావడం జరిగింది. 10వతేదీ ఆయన 25మంది అంధబాలలతో కలిసి నెల్లూరు కొండాయపాళెంగేటు వద్దగల క్యాప్(చైల్డ్ అండ్ పోలీస్) ప్రాజెక్టును సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనలో కసి, తపన, క్రమశిక్షణ వుంటే ఎంతటి లక్ష్యమైనా మనకు లొంగిపోవాల్సిందేనన్నారు. వీధిబాలలను దత్తత తీసుకుని వారిని ఉన్నతమార్గంలో నడిపించేందుకు కృషి చేస్తున్న ఎస్పీ బి.వి.రమణకుమార్‌ను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి ఎం.రామలింగం, సిఐలు రాజశేఖర్‌రెడ్డి, కిషోర్‌బాబు, ఎంఇఓ రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

# ఆధార్ కేంద్రాలపై నిఘా



ఆధార్ కేంద్రంలో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ముఖ్యంగా రెండవ అంతస్తులో ఆధార్‌కేంద్రం ఏర్పాటుచేయటంతో వృద్ధులు, వికలాంగులు చాలా ఇబ్బందులు పడుతున్నారని ఒకటికి నాలుగుసార్లు ఆధార్‌కార్డు కోసం కేంద్రానికి రావలసి రావటంతో కూలీలు, ఆటోడ్రైవర్లు, చిరు ఉద్యోగులు, నరకయాతన అనుభవిస్తున్నారని కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు.

ఆధార్ అవకతవకలపై ప్రజల ఇబ్బందులపై నెల్లూరు పొగతోటలోని ఆధార్ కేంద్రం వద్ద 11వతేదీ వై.ఎస్.ఆర్ కాంగ్రెస్‌పార్టీ నిరసన ధర్నా నిర్వహించింది. ఈసందర్భంగా కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ ఆధార్ కేంద్రాలలో పరిస్థితుల మెరుగుకోసం ఆధార్ కేంద్రాల పెంపుదల కోసం ఈ నిరసన ధర్నా నిర్వహించామని అన్నారు. ఆధార్‌కేంద్రంలో వై.ఎస్.ఆర్.కాంగ్రెస్ నిఘా బృందాన్ని ఏర్పాటుచేసామని వారు ఎప్పటికప్పుడు పరిస్థితిని గమనించి తమకు తెలియజేస్తారని ఎక్కడ ఎలాంటి ఇబ్బంది వచ్చినా తక్షణం తాను అక్కడికి వచ్చి ప్రజలపక్షాన పోరాటం చేస్తానని అన్నారు. ఈరోజు నుంచి స్టోన్‌హౌస్‌పేట బి.వి. ఎస్. హైస్కూల్‌లో, దర్గామిట్ట ఎన్.జి.ఓ హోమ్‌లో ఆధార్‌కేంద్రాలు ఏర్పాటుచేశారని అక్కడ కూడా తాము నిఘా బృందాలను ఏర్పాటుచేశామని అన్నారు. ఆధార్ కేంద్రాలలో ఎటువంటి ఇబ్బంది వచ్చినా స్వయంగా తన నెంబరు 98494 92225కి ఫోన్‌చేసి తెలియజేస్తే వెంటనే స్పందిస్తామని కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో కె.వి.రాఘవ రెడ్డి, రూరల్ మండల కన్వీనర్ పిగిలాం నరేష్ యాదవ్, తాటి వెంకటేశ్వరరావు, నరసింహయ్య ముదిరాజ్, మందా బాజ్జీ, మురారి, పురుషోత్తం యాదవ్, షబ్బీర్, హజరత్‌నాయుడు, మహేష్, ఫిరోజ్, నజీర్ పాల్గొన్నారు.



ఈనెల 11వతేదీన కావలి మండలం సర్వాయ పాలెంలోని ప్రభుత్వ వసతిగృహాన్ని సందర్శించి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి పితాని సత్యనారాయణ, కావలి శాసనసభ్యుడు బీదా మస్తాన్‌రావు, జిల్లా కలెక్టర్ బి.శ్రీధర్.

# సంస్కృతిని కాపాడుకుందాం

ప్రపంచంలో అత్యున్నతమైన హైందవ సంస్కృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై వుందని జిల్లా కలెక్టర్ బి.శ్రీధర్ పిలుపునిచ్చారు. ఆదివారం నెల్లూరు దర్గామిట్టలోని ఏ.ఎల్.రావు కళ్యాణ మండపంలో గాయత్రి పరివార్ ఆధ్వర్యాన భారతీయ సంస్కృతి జ్ఞానపరీక్ష 2012-13 విజేతలకు బహుమతి ప్రదానం జరిగింది. నేటి యువత పాశ్చాత్య సంస్కృతులకు అలవాటుపడుతూ మన పండుగలు, సంప్రదాయాలను మంటగలుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. అమెరికా, బ్రిటన్ ఇతర దేశాలలో మన తెలుగువాళ్లు మన భారతీయ పండుగలను ఎంతో వైభవంగా జరుపుకుంటుంటే మనం మాత్రం వాటిని విస్మరిస్తున్నామన్నారు. దేశ జనాభాలో 40శాతం యువతేనని, మన సంస్కృతి సంప్రదాయాలను వారు గౌరవించి ముందుకు తీసుకెళ్లాలన్నారు. సంస్కృతీసంప్రదాయాలను పరిరక్షించేందుకు కృషి చేస్తున్న గాయత్రి పరివార్‌ను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో గాయత్రి పరివార్ జిల్లా కన్వీనర్ టి.లక్ష్మీభవాని, దక్షిణ భారత కన్వీనర్ అశ్విని సుబ్బారావు, జి.తిరునారాయణ, డాక్టర్ ఏ.వి.రమణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న జిల్లా కలెక్టర్ బి.శ్రీధర్

## "మిథునం" భరణికి

# నెల్లూరీయుల అభినందన



వ్యాపార చిత్రాల ఒరవడితో ముందుకు సాగుతున్న నేటి తెలుగు సినిమా ప్రపంచంలో తెలుగోడు గర్వించదగ్గ విజయవంతమైన "మిథునం" చిత్రానికి దర్శకత్వం వహించి కుటుంబసమేతంగా చూడదగ్గ తెలుగుసినిమా ఇదిరా అని నిరూపించిన కవి, రచయిత, నటుడు, దర్శకుడు తనికెళ్ళభరణిని నెల్లూరుకు చెందిన హరివిల్లు క్రియేషన్స్ నిర్వాహకుడు టి.వి.నటుడు దోర్నాల హరిబాబు, తనికెళ్ళభరణికి చిరపరిచితులు నందా ఇమిటేషన్ జ్యువెల్లరీ అధినేత నందగోపాల్, పవన్, ప్రముఖ మిమిక్రీ కళాకారుడు ధ్వన్యనుకరణ చక్రవర్తి, భవిరి రవి, సినీ హాస్యనటులు గౌతంరాజు, ఎంట్రీలాఫిన్స్ జివియస్ రాజు తదితరులు గజరోజాపుష్పమాలతో సత్కరించి అభినందించారు. హైదరాబాద్ రవీంద్రభారతిలో ఆదివారం నాడు జరిగిన మిథునం చిత్రం 50రోజుల ఉత్సవంలో వారు పాల్గొని భరణిని అభినందించారు. భరణి దర్శకత్వంలో మరిన్ని విజయవంతమైన చిత్రాలు రావాలని వారు ఆశాభావం వ్యక్తం చేసారు. ఇంకా ఈ కార్యక్రమంలో ప్రముఖ సినీనేపథ్యగాయకులు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం, సినీనటి లక్ష్మి, సినీ దర్శకులు దాసరి నారాయణరావు, కె.రాఘవేంద్రరావు, కె.విశ్వనాథ్ తదితర సినీప్రముఖులు పాల్గొన్నారు.

# నడకతో ఆరోగ్యం



నారాయణ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ సహకారంతో ఈనెల 10న నెల్లూరు ఏసిసుబ్బారెడ్డి స్టేడియం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 128మంది సభ్యులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. నారాయణ హాస్పిటల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ సి.భక్తవత్సలరెడ్డి, డాక్టర్ కె.అంకిరెడ్డిలు ఆరోగ్య పరీక్షలు జరిపి, ఆరోగ్యంగా వుండడానికి తీసుకోవలసిన జాగ్రత్తలు, వివరించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు రాఘవశెట్టి మాట్లాడుతూ నడకతో ఆరోగ్యం కాపాడుకోవాలని సభ్యులను కోరారు. ప్రతి మూడు నెలలకోసారి ఈ విధంగా ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి నలుబోలు బలరామయ్యనాయుడు, కోశాధికారి స్వర్ణ రమేష్, వీరిశెట్టి హజరత్‌బాబు, నందగోపాల్, రవిచంద్ర, ఓబులేరెడ్డి, కె.విజయ భాస్కర్‌రెడ్డి, బివి.హరికృష్ణ, సిహెచ్ దొరస్వామి నాయుడు, ఎం.ఎల్లారెడ్డి మొదలగువారు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రవణా నక్షత్ర

# శ్రీనివాస కల్యాణం



తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మప్రచార పరిషత్, ధార్మికసలహామండలి సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 9న నెల్లూరు టిటిడి కల్యాణమండపంలో శ్రీ వెంకటేశ్వరస్వామి జన్మనక్షత్రం శ్రవణం సందర్భంగా శ్రీనివాసకల్యాణం వైభవంగా జరిగింది. వేదికపై కొలువుదీరిన అలివేలు మంగ, పద్మావతీ దేవేరుల నడుమ శ్రీహరి ఉత్సవమూర్తులకు వేదపండితులు వేదగిరి ఫణిశర్మ, గోమిద గిరిధర్, నాగేంద్రశర్మలు గంధం, సుగంధద్రవ్యాలు, పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. సంగీత విద్వాంసులు బాలార్క శిష్యులు మాలతి, అనూరాధ, రమ, అరుణ, నిర్మల మొదలగువారు అన్నమాచార్య సంకీర్తనలను ఆలపించగా శ్రీ వెంకటేశ్వరస్వామి విశేషాలను ఏబి.ఆనంద్, చరణ్‌కుమార్‌లు భక్తులకు తెలియపరిచారు. నారానాగేశ్వరరావు బృందం సభ్యులు భక్తులకు తిరునామం దిద్దగా, ధార్మికసలహామండలి సభ్యులు పవిత్ర అక్షింతలు, తీర్థప్రసాదాలు పంపిణీచేసారు. కల్యాణమహోత్సవంలో ధార్మికసలహామండలి సభ్యులు వాకాటి విజయకుమార్‌రెడ్డి, వీరిశెట్టి సుధాకర్, హరనాథ్, టిటిడీ జిల్లా సూపరింటెండెంట్ రామ్‌గోపాల్ పురప్రముఖులు, విరివిగా భక్తులు పాల్గొన్నారు.


సత్యంజీ గ్రూప్
సత్యంజీ సింహపురి సిటి
అందమైన గ్రీన్ పార్క్
వి.బి.ఆర్. స్కూల్ దగ్గర, ధనలక్ష్మీపురం, మెయిన్ రోడ్డు, ముత్తుకూరు రోడ్డు, నెల్లూరు.
నెల్లూరు సిటీలో 36 ఎకరాల గేటెడ్ కమ్యూనిటీలో
బ్యాంకులోన్ కస్టమర్స్‌కు
డబుల్ బెడ్‌రూమ్ ఫ్లాట్ 1100 Sft.
23,00,000/-
SPOT CASH
14,00,000/-
ప్రాజెక్ట్-1లో ఈ అవకాశం 10 మందికి మాత్రమే.
* Car Parking Extra
సర్వీస్ అపార్ట్‌మెంట్స్ 400 Sft.
ఫర్నిచర్‌తో కలిపి
10,00,000/-
*Car Parking Extra మాత్రమే.
33 అం॥ ప్లాట్స్ బై బ్యాక్ పద్ధతిలో
2 సం॥లకే
డబుల్ బెనిఫిట్
మొదటి 60 మందికి మాత్రమే.
మీ పెట్టుబడుల రెట్టింపు కొరకు You Tube, R.R., S.Tv., Gem Channels చూడండి.
శుక్రవారం 7.30 P.M.
శనివారం 10.30 A.M.
7.30 P.M.
ఆదివారం 10.30 A.M.
బ్యాంకు లోన్ సౌకర్యం కలదు
9133 222 558
0861-2318286, 2341183
08622272555
www.satyamglanddevelopers.org
e-mail : jayasankar441@yahoo.com

PDF Compressor Free Version



కదంబం

## పోయెమే రాయనక్కర్లేదు

మంత్రి కృష్ణమోహన్
94410 28186.

పోయెమే రాయనక్కర్లేదు- ఒకరోజు
నీ స్మృతిపేటికలోకి కొన్ని దృశ్యాలు
అపురూపమైనవో అపూర్వమైనవో
చేరవస్తే చాలు-
నీ హృదయసీమ విచలితంచేసే
ఉద్వేగభరితంచేసే, నిన్ను ద్రవింపజేసే
ఒక జీవనానుభవం పొందితేచాలు-
కళాత్మకమో, అది సంఘర్షణాత్మకమో
వో క్లాసిక్ నీ కంటబడితేచాలు-
నువు, పోయెమే రాయనక్కర్లేదు.
నిన్ను ఊపి, ఊగించి శాసించి
ఊపిరాడనివ్వని
ఓ ఉధృత ప్రజాపోరాటాన్నో రణాన్నో
నీ మనోనేత్రం దర్శించగల్గితేచాలు-
పోయెమే రాయనక్కర్లేదు.

ఓ అన్నార్థి ఆక్రందనో
అనాథ బతుకుపోరో
నడిరేయి చెట్టుకింద ముడుచుక్కూర్చున్న
నిరాశ్రయి
ముదుసలి అమ్మ ఆరాటమో
దగాపడ్డచెల్లి ఆత్మహననమో..-
వ్యథ చెంది
యీ స్వార్థ అరాచక నీతిబాహ్య కుటిల వ్యవస్థ మీద
ఆగ్రహం పొంగితేచాలు
పోయెమే రాయనక్కర్లేదు
నీకంట్లో
పాయలు పాయలైన ఎర్రని ప్రేమజీర
భళ్ళున బద్దలైన ఒక నీటితెర
వో దయాపూర్ణవెన్నెల విచ్చుకుంటే చాలు-
ఇవాల్టికి నువ్వు జీవించినట్టే
యీ రోజు మహోజ్జ్వలంగా ముగించినట్టే-
సృజనశీలీ! నా ఆత్మరూపుడా!
ఒకరోజు నువు
పోయెమే రాయనక్కర్లేదు-

## నియమనిష్ఠలతో అగ్నిగుండ ప్రవేశం

నెల్లూరులోని స్టోన్‌హౌస్‌పేటలో వెలసియున్న శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో సోమవారం అగ్నిగుండ ప్రవేశమహోత్సవాన్ని నిర్వహించారు. అమ్మవారు అగ్నిలో ప్రవేశించిన రోజును పురస్కరించుకొని ఆలయ ప్రధానార్చకులు శివయ్యస్వామి ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు పినాకిని నదికి చేరుకుని గంగాదేవి పూజలను నిర్వహించి నదీజలాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. ఆలయంలో అమ్మవారికి కలశాల్లోని జలంతో ప్రతిబింబాషేకాన్ని వైభవంగా నిర్వహించారు. మేళతాళాలతో, బాణాసంచాలతో ఊరేగింపుగా అగ్నిగుండ ప్రవేశ భక్తులు ఆలయానికి చేరుకొని ప్రదక్షిణలు చేసి అనంతరం అగ్నిగుండం ప్రవేశం చేశారు. వాసవి కన్యకాపరమేశ్వరి ఉత్సవ కమిటీ, ఆలయకమిటీ పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో ఉభయకర్తలుగా దాసా సురేష్‌రాజా, లావణ్య దంపతులు వ్యవహరించారు.

ఈ కార్యక్రమంలో ఆలయచైర్మెన్ మునగా వెంకటేశ్వర్లు, గౌరవాధ్యక్షుడు శేగు షణ్ముఖరావు, కార్యదర్శి మంచికంటి శ్రీనివాసులు, కోశాధి కారి సాయిసువర్ణ, ఉత్సవ కమిటీ సభ్యులు ఎంపి ఆంజనేయులు, నూనె కోటేశ్వరరావు, సోమిశెట్టి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## నెల్లూరు దోమల వల్లే అఫ్జల్‌కు ఉరి

శ్రీను గల్పిక

అది మహిళలకు రక్షణ లేదని మహిళా ముఖ్యమంత్రి షీలాదీక్షిత్ కౌర్ ముఖ్యమంత్రిగా వున్న ఢిల్లీ మహానగరం. ఆ నగరంలో కేంద్ర హోంశాఖ మంత్రి సుశీల్‌షిండే కార్యాలయం. అక్కడ ఆయనతో పాటు ప్రధాని మన్మోహన్‌సింగ్, యూపీఏ ఛైర్‌పర్సన్ సోనియాగాంధీ, రక్షణ మంత్రి ఏ.కె.ఆంటోని, కాంగ్రెస్ యువరాజు రాహుల్‌గాంధీ(42) వున్నారు. వాళ్లకు ఎదురుగా జమ్మూకాశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా, మానవహక్కుల ఫోరం అధ్యక్షులు జీవన్‌కుమార్, ప్రధాన కార్యదర్శి జి.వి.కృష్ణ, పౌరహక్కుల సంఘం నాయకులు వరవరరావు, ప్రపంచ మానవహక్కుల సంస్థ(ఆమ్నెస్టీ) దక్షిణాసియా డైరక్టర్ మీనాక్షి గంగూలీ కూర్చుని వున్నారు. పౌరహక్కుల సంఘం నాయకుడు వరవరరావు ఆవేశంగా లేచి... మీవి మనసులేనా... మీవి గుండెలా... గుండ్రాల్లా... అఫ్జల్ గురు వంటి ఒక ఉద్యమకారుడిని ఉరితీయడానికి మీకు మనసెలా ఒప్పింది. మొన్నచూస్తే పసివాడని కూడా చూడకుండా కసబ్‌ను ఉరితీసారు. ఇప్పుడుచూస్తే అఫ్జల్‌గురును... అసలు మీకంటే బ్రిటీష్‌వాళ్లే నయం. ఇంకా ఎంతమంది తీవ్రవాదులను ఇలా ఉరితీసుకుంటూ పోతారు? అని ప్రశ్నించాడు. ఒమర్ అబ్దుల్లా లేచి... మీకు చిలక్కిచెప్పినట్లు చెప్పాం... అఫ్జల్‌గురు లాంటి ఒక ఉద్యమకారుడిని ఉరితీస్తే ఆ భగవంతుడు కూడా క్షమించడని. అఫ్జల్‌ను ఉరితీస్తే జమ్మూకాశ్మీర్ అగ్నిగుండంగా మారుతుందని కూడా హెచ్చరించాను. కాని మీరు అప్పుడేమో విన్నట్లే నటించారు... ఉన్నట్లుండి ఉరితీసారు... అని ఉద్వేగంగా అన్నాడు. ఆమ్నెస్టీ ప్రతినిధి మీనాక్షి గంగూలీ లేచి... మేం ప్రపంచమంతా కూడా ఉరిశిక్షలను నిలిపివేయాలని పోరాడుతున్నాం... కాని మీరేమో ఉరిశిక్షలు పెంచుకుంటూ పోతున్నారు. అసలు మీరు మనుషులేనా... మీకు హృదయస్పందన లేదా... జాలి, దయ, కనికరం అసలు లేవా... అని ప్రశ్నించింది. మానవ హక్కుల సంఘం నాయకులు జీవన్‌కుమార్ అందుకుని... అఫ్జల్‌గురు వల్ల చనిపోయింది 9మందే! ఈ దేశంలో మంత్రులు, అధికారులు, ప్రభుత్వాలు చేస్తున్న తప్పులకు రోజూ వందల మంది ఛస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి పెంచిన కరెంట్ ఛార్జీలో వస్తున్న బిల్లులు చూసి రోజుకు గుండెపోటుతో వంద మంది మరణిస్తున్నారు... కేసీఆర్ రేపిన తెలంగాణ చిచ్చుకు పదుల సంఖ్యలో బలవుతున్నారు. దేశం నిండా ఇలాంటివెన్నో వున్నాయి. ఇవన్నీ పక్కనపెట్టి అఫ్జల్‌గురు పెద్ద నేరమేదో చేసినట్లు ఉరిశిక్ష వేసారే... ఇదెక్కడి అన్యాయం... అసలు మీవి హృదయాలా? పాషాణాలా? సోనియమ్మా... నీ భర్త హంతకులపైనే జాలిచూపిన నీవు అఫ్జల్ గురుపై దయ చూపలేకపోయావా? అని ప్రశ్నించాడు.

అప్పటివరకు వాళ్లు చెప్పిందంతా ఓపికగా వింటున్న సుశీల్‌కుమార్ షిండేకు సోనియా పేరెత్తగానే అరికాల్లో మండింది. ఆగ్రహంతో లేచి... అక్కడితో ఆపండి... అంతకుమించి ఒక్క మాట మాట్లాడినా మీకు మర్యాద దక్కదు... ఏంటి... మేం మనసులేని మనుషులమా? మావి పాషాణహృదయాలా? మాకు జాలి, దయ, కరుణా లేవా? అవన్నీ వుండబట్టే అఫ్జల్‌గురును ఉరితీసాం... మా మానవత్వాన్ని చాటుకున్నాం అని చెప్పాడు. షిండే మాటలతో అఫ్జల్‌కు అనుకూలంగా మాట్లాడుతున్న వారి మీద వెయ్యి పిడుగులు ఒకేసారి పడ్డట్లయ్యింది. ఐదు నిముషాల పాటు వాళ్లు తేరుకోలేకపోయారు. కొంతసేపటికి ఈ లోకంలోకి వచ్చాక... ఒమర్ వుండి... మానవతా దృక్పథంతో ఉరితీసారా... అదెలా అంటూ అయోమయంగా అడిగాడు. అప్పుడు షిండే... చెబుతాను బాబు చెబుతాను అని గుమ్మడి లెవల్లో డైలాగ్ వదిలి వారి ముఖాలముందు టార్టాయిస్ కాయిల్ పెట్టి గిర్రున తిప్పి ఫ్లాష్‌బ్యాక్‌లోకి తీసుకెళ్లాడు.

★★★★★

పార్లమెంట్ మీద దాడి జరిగాక ఢిల్లీ హైకోర్టు అఫ్జల్‌గురును నిందితుడిగా అంగీకరించి ఉరిశిక్ష విధించడం, సుప్రీంకోర్టు కూడా దానిని సమర్థించడం జరిగాయి. దీంతో అఫ్జల్‌గురును తీహార్‌జైలులో వుంచారు. అప్పుడే అఫ్జల్‌గురును ఉరితీస్తే తమ రాష్ట్రంలో ఆందోళనలు చెలరేగుతాయంటూ జమ్మూకాశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా కేంద్రాన్ని హెచ్చరించారు. అలాగే పలువురు నాయకుల నుండి సైతం ఉరిశిక్ష వద్దంటూ ఒత్తిళ్లు రాసాగాయి. ఓటు బ్యాంకు రాజకీయాలను అమితంగా అభిమానించే కాంగ్రెస్ నాయకులు ఈ విషయంపై ఆలోచనలో పడ్డారు. ఉరితీస్తే కొందరి నుండి వ్యతిరేకత వస్తుంది. ఉరితీయకపోతే ప్రజల నుండి వ్యతిరేకత వస్తుంది... ఈ సమస్యను ఎలా అధిగమించాలా అని అప్పటి హోంమంత్రి శివరాజ్‌పాటిల్ మల్లగుల్లాలు పడసాగాడు. అప్పుడు ఆయనకు ఎలాంటి తల తిక్క సమస్యలనైనా పరిష్కారం చేయగల స్టైల్ ఆఫ్ సింహపురి, నెల్లూరురూరల్ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి(54 తొమ్మిదేళ్ల క్రితం) గుర్తుకొచ్చాడు. వెంటనే ఆయనకు ఫోన్ చేసి సమస్యను చెప్పాడు. అప్పుడు వివేకా... ఇది కూడా ఓ సమస్యేనా? మనం రాజకీయ నాయకులం... ఎదుటివాడు వాడివేలితో వాడే పొడుచుకునేటట్లు చేయాలిగాని... మన వేలికి పని పెట్టకూడదు. ఇప్పుడే మా నెల్లూరు మున్సిపల్ అధికారులకు కొంత సరుకునిచ్చి మీ వద్దకు పంపిస్తాను.. వాళ్లు వచ్చి అంతా చూసుకుంటారని చెప్పాడు. వివేకా మాటలతో శివరాజ్ పాటిల్‌కు కొండంత ధైర్యం వచ్చింది. వివేకా చెప్పినట్లే కొంతమంది మున్సిపల్ అధికారులు ఢిల్లీ వెళ్లి శివరాజ్‌పాటిల్‌ను కలిసారు. ఆయన వాళ్లను తీసుకుని అఫ్జల్‌గురు వుంటున్న తీహార్ జైలుకు వెళ్లాడు. అఫ్జల్‌గురు వుంటున్న గది వద్దకు నెల్లూరు మున్సిపల్ అధికారులు చేరుకుని... తమ చేతుల్లో వున్న సంచులను విప్పారు. అంతే.. అందులో వున్న మున్సిపల్ కార్పొరేషన్ ముదురుదోమలు అఫ్జల్‌గురు వుంటున్న గదిలోకి దూరాయి. ఆయన మీద పాశవికంగా దాడి చేయసాగాయి. దోమలను వదిలేసి మున్సిపల్ అధికారులు, శివరాజ్‌పాటిల్ వెనక్కి వచ్చేసారు. కాని దోమలు మాత్రం రాత్రంతా అఫ్జల్‌గురుపై దాడిచేసి రక్తాన్ని పీల్చడం, పగలు బాత్రూంలో రెస్ట్ తీసుకోవడం చేయసాగాయి. దోమలు కరుస్తున్నప్పుడు అఫ్జల్‌గురు చేసే హాహాకారాలకు పరిసరాలలో వుండే ఖైదీలకు కూడా అయ్యో... పాపం అనిపించేది. ఎంత నేరం చేస్తేమాత్రం ఏదో ఉరిశిక్షో, కారాగారశిక్షో వేయాలిగాని ఇంత క్రూరమైన శిక్ష విధిస్తారా అని జాలిచూపించే వాళ్లు. ప్రతిరోజూ ఇదే తంతు... ఈ నరకాన్ని అనుభవించలేక... నాకు ఉరిశిక్ష వేసి ఈ నరకం నుండి విముక్తి కల్పించండంటూ అఫ్జల్‌గురు జైలు అధికారుల నుండి రాష్ట్రపతి వరకు అందరికీ విన్నవించాడు. అద్వానీ లాంటి దయామయుడు ప్రధాని అయ్యుంటే నాకెప్పుడో ఉరిశిక్ష వేసి ఈ నరకం నుండి విముక్తి కల్పించి వుండేవాడని కూడా స్టేట్‌మెంట్ ఇచ్చాడు. ఎంత నేరం చేసినా ఇంత క్రూరమైన శిక్ష విధించడం కరక్ట్ కాదనే నిర్ణయానికి కేంద్రప్రభుత్వం కూడా వచ్చింది. అందుకే అఫ్జల్‌గురు కోరినట్లే మానవతా దృక్పథంతో ఆయనకు ఉరిశిక్షను అమలు చేసారు.

★★★★★

ఇక్కడితో ఫ్లాష్‌బ్యాక్ అయిపోయింది. అప్పుడు షిండే... ఇప్పుడు చెప్పండి... మేం మనుషులం కామా... మాకు మనసులు లేవా? మావి బండబారిన గుండెలా? అని కన్నీటితో ప్రశ్నించాడు. అప్పుడు ఒమర్ అబ్దుల్లాతో పాటు మిగిలినవాళ్లు సారీ సార్... మిమ్మల్ని తప్పుగా అర్థం చేసుకున్నాం... ఉరిశిక్షను మించిన కఠిన శిక్షలేదని ఇంతకాలం పొరపాటుపడ్డాం, అంతకంటే పెద్దశిక్ష నుండి తప్పించడానికే మీరు అఫ్జల్‌గురును ఉరితీసారని తెలియక మిమ్మల్ని అనుమానించాం, ఆగ్రహించాం. ఇవన్నీ మనసులో పెట్టుకోవద్దంటూ అక్కడ నుండి లేచారు.

## డా॥ జయప్రదకు రెండు సాహితీఅవార్డులు




ప్రముఖ రచయిత్రి, డాక్టర్ పెళ్ళకూరు జయప్రద ఇటీవల రెండు సాహితీ అవార్డులను అందుకున్నారు. విజయవాడలోని శ్రీ శివరామక్షేత్రంలో డాక్టర్ ఊటుకూరి లక్ష్మీకాంతమ్మ కళాపీఠం అవార్డును ప్రసిద్ధ పాత్రికేయులు పద్మశ్రీ డా॥ తుర్లపాటి కుటుంబరావు చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ జయప్రదను కళాపీఠం వ్యవస్థాపక అధ్యక్షులు కోకా నాగేంద్రరావు, రచయితలు కోకా విమలకుమారి, వెన్నా వల్లభరావు, డాక్టర్ పద్మశ్రీ తుర్లపాటి కుటుంబరావు, అంబటి మధుమోహనకృష్ణ తదితరులు ఘనంగా సత్కరించారు. అదేవిధంగా ఈ నెల 10న ఒంగోలు టిటిడి కల్యాణ మండపంలో జరిగిన 7వ రాష్ట్రస్థాయి రచయితల మహాసభల వేదికమీద సెషన్స్‌జడ్జి కె.బాలకృష్ణారెడ్డి తన దివంగత భార్య రాజేశ్వరి పేరుమీద ఇస్తున్న సాహితీఅవార్డును అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖకవులు కె.శివారెడ్డి, డా॥ దర్భశయనం శ్రీనివాసాచార్య, డా॥ శివశంకర్, పెన్నా శివరామకృష్ణ, డా॥ చంద్రశేఖర్‌రావు, ప్రముఖ పాత్రికేయులు డా॥ తుర్లపాటి కుటుంబరావులు పాల్గొన్నారు.

### సోమిరెడ్డి జమున స్మారక అవార్డు కోసం "నానీ"లకు పిలుపు

డాక్టర్ పెళ్ళకూరు జయప్రద తన సోదరి స్వర్గీయ సోమిరెడ్డి జమున స్మారకార్థం సాహితీఅవార్డును నెలకొల్పి గత నాలుగు సంవత్సరాల నుంచి నానీల కవితా సంపుటాలకు ఇవ్వడం జరుగుతోంది. ఈ ఏడు జూలై 2011 నుండి డిసెంబర్ 2012లోపల ముద్రించబడిన నానీల కవితా సంపుటలను అవార్డు కోసం పంపమని కవులను వారు కోరుతున్నారు. అవార్డుకు ఎంపికైన కవిని లేదా కవయిత్రిని రూ॥ 5000తో పాటు శాలువా, జ్ఞాపికలతో సెప్టెంబరు 2013లో నెల్లూరులో జరిగే సభలో సత్కరిస్తామని డాక్టర్ పెళ్ళకూరు జయప్రద తెలిపారు. దీనికోసం 4ప్రతులను మార్చి 31వ తేదీలోగా వంశీ నర్సింగ్ హోం, ఇందిరాభవన్‌రోడ్, నెల్లూరు - 1 చిరునామాకు పంపమని కోరుతున్నారు.

## మేషం



అశ్విని, భరణి, కృత్తిక 1 పాదము

కుటుంబసభ్యుల మధ్య అవగాహన, అనురాగాలుంటాయి. స్త్రీలకు అనారోగ్య బాధలుంటాయి. వృత్తి వ్యాపారాలలో వ్యాపకం పెరిగి ఆదాయం పెరుగుతుంది. ఉద్యోగులకు ప్రమోషన్లు, స్థానమార్పులకు అవకాశాలుండి బాధ్యతలు పెరుగుతాయి. అధికారిక పర్యటనలుంటాయి. క్రొత్త పెట్టుబడులకు కొంత ఆగి ప్రయత్నించడం మంచిది. షేర్లు మీద లాభాలుంటాయి.


## వృషభం



కృత్తిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశిర్ష1, 2పాదాలు

వ్యాపార, భాగస్వామిక ఒప్పందాలలో సముచిత నిర్ణయాలు చేసుకొంటారు. వ్యాపారంలో ఆదాయం పెరగడం, వృత్తిపరంగా ఆదాయం, శ్రమ ఎక్కువగా ఉంటుంది. రావలసిన బాకీలు లభించడంలో, కోర్టు కేసులందు అనుకూలత, షేర్లు పెట్టుబడులపై లాభాలుంటాయి. విద్యార్థులకు విద్యాశ్రమ ఎక్కువగా ఉంటుంది. ఉద్యోగులకు అధికారులతో అదనపు బాధ్యతలుంటాయి.


## మిథునం



మృగశిర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

బిడ్డల యొక్క ఆరోగ్య, విద్యాపరమైన సమస్యలు బాధిస్తాయి. శాస్త్ర సాంకేతిక రంగాలలో పరిశోధనావకాశాలు బాగుంటాయి. వృత్తిపరంగా వ్యాపకం, ఆదాయం బాగుంటుంది. మీ ఆలోచనలు పథకాలు కార్యరూపం దాల్చగలవు. ఉద్యోగ నిర్వహణలో పొరపాట్లు రాకుండా చూసుకొనండి. అధికారులవాదులు వత్తిడి వ్యాపారులపై ఉంటుంది.


## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

వ్యాపారపరంగా స్తబ్ధత చోటుచేసుకొంటుంది. వ్యాపారవర్గాలకు ఆదాయం తగ్గుతుంది. వైద్యన్యాయ, చిన్న పరిశ్రమల వారికి అభివృద్ధి ఆదాయం బాగుంటుంది. అవసరాలకు కొద్దిపాటి ఋణం చేయవలసి వస్తుంది. వ్యవహారాలలో, అగ్రిమెంట్ల విషయంలో ఖచ్చితంగా ఉండండి. విద్యార్థులకు చదువుపై శ్రద్ధ, ఉద్యోగులకు విధినిర్వహణలో సామర్థ్యం బాగుంటుంది.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

ఖర్చులు పెరుగుతాయి క్రొత్త పెట్టుబడులు, భాగస్వామ్యాలకు అవకాశాలుంటాయి, దొరుకుతాయి. వృత్తి వ్యాపారాలలో స్వల్ప లాభాలుంటాయి. ప్రముఖుల పరిచయాలతో అనుకున్న పనులు నెరవేర్చుకొనడం, స్థిరాస్తులు, ఇల్లు స్థలాలు ఏర్పరచుకొనే ఆలోచనలు కలుగుతాయి. క్రొత్త కాంట్రాక్టులు లభించగలవు. కుటుంబసౌఖ్యం బాగుంటుంది.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

ఈ రాశి వారికి ఆదాయవ్యయాలు సరిపోతుంటాయి. పెద్ద ఖర్చు ఒకటి పైనబడవచ్చును. వ్యాపారాభివృద్ధి అవకాశాలు చేజారిపోవచ్చు. అవసరాలకు ఋణాలు చేస్తారు. అనుకున్న పనులు నిదానంగా జరుగుతాయి. ఉద్యోగులు తమ అధికారులతోను పబ్లిక్‌తోను జాగ్రత్తగా వ్యవహరించాలి. ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం. సమస్యలను జాగ్రత్తగా పరిష్కరించే శక్తి ఉంటుంది.



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు
బాలాజీనగర్, నెల్లూరు

# రాశి - మీ వాసి

తేది. 15.02.2013 నుండి
తేది. 21.02.2013 వరకు

ఈవారం కేతువు మేషంలో, గురువు వృషభంలో, మేషవృషభమిథునాలలో చంద్రుడు, తులలో రాహుశనులు, మకరంలో శుక్రుడు..కుంభంలో రవికుజబుధులు సంచరిస్తారు.


## పంచాంగము :

తేది 17 ఆదివారము రథసప్తమి
తేది 20 బుధవారము శుక్రమౌఢ్యమి ప్రారంభము మౌఢ్యమికి ముందు 3రోజులు బాల్యమౌఢ్యమి అని అంటారు. కాబట్టి 18వ తేది నుండి శుభకార్య నిషేధమని శాస్త్ర నిర్ధేశ్యము.

## మాఘమాస శుక్లపక్షతిథులు

| | | | |
|---|---|---|---|
| తేది. 15 | శుక్ర | పంచమి | ఉ॥ గం.11.06వ॥ |
| తేది. 16 | శని | షష్ఠి | మ॥ గం.12.10వ॥ |
| తేది. 17 | ఆది | సప్తమి | మ॥ గం.1.04వ॥ |
| తేది. 18 | సోమ | అష్టమి | సా॥ గం.3.30వ॥ |
| తేది. 19 | మంగళ | నవమి | సా॥ గం. 5.36వ॥ |
| తేది. 20 | బుధ | దశమి | రా॥ గం.7.45వ॥ |
| తేది. 21 | గురు | ఏకాదశి | రా॥ గం.9.48వ॥ |


## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

వృత్తిపరంగా విశ్రాంతి దొరకదు, వ్యాపారవర్గాలకు పరిస్థితులు స్తబ్ధతతో ఉంటాయి. ఆదాయం ఖర్చులు సరిపోతుంటాయి. పనులందు ఆలోచనారాహిత్యం, టెన్షన్ ఎక్కువగా ఉంటుంది. అయినా పనులు నిదానంగా సానుకూలం కాగలవు. ఉద్యోగులకు అదనపు పనిభారం ఉండి అధికారుల సహకారం బాగుంటుంది. కుటుంబసభ్యులతో అనుకూలత తక్కువగా ఉంటుంది.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

అస్తుల క్రయవిక్రయాలలో తొందరపాటువద్దు. బంధువర్గంతో సోదరులతో సర్దుబాటుతనంగా పోవడం మంచిది. వర్కర్లతో యజమానులకు సమస్యలుండవచ్చును. ఏ పనినైనా సమర్థవంతంగా నిర్వహించి సమస్యలను సర్దుబాటు చేసుకొంటారు. వ్యాపారపెట్టుబడులు, భాగస్వామి వ్యవహారాలలో దృష్టిపెడతారు. విద్యార్థులు విద్యలో శ్రద్ధచూపుతారు.


## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

స్థిరాస్తుల లావాదేవీలందు తొందరపాటువద్దు. సమస్యలు కలిగే అవకాశం ఉన్నది. కుటుంబసభ్యులకు అనారోగ్యబాధలుంటాయి. వ్యాపారవర్గాలకు విస్తరణ అభివృద్ధి అవకాశాలు దొరుకుతాయి. వృత్తిపరంగా పేరుప్రతిష్ఠలు బాగుంటాయి. ఆదాయం పెరుగుతుంది. పిల్లల విద్యా ఉద్యోగ వివాహ విషయాలలో కొంత ఆందోళన ఉంటుంది. విద్యార్థులు మరింత కష్టపడాల్సి వుంటుంది.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

ఆర్థిక అభివృద్ధి ప్రయత్నాలు ఫలించి మంచి అవకాశాలు దొరుకుతాయి. ఆదాయం గతంకంటే పెరుగుతుంది. గృహమార్పులు, వస్తు వాహనాలు సమకూర్చుకొనడం జరుగుతుంది. షేర్లు పెట్టుబడుల మీద లాభాలు గడిస్తారు. ఆరోగ్యం బాగుంటుంది. ఉద్యోగప్రయత్నాలలో అనుకూల ఆదేశాలు అందుతాయి. శుభకార్యముల విషయమై చర్చలు నిర్ణయాలు జరుగుతాయి.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

వృత్తిపరంగా అభివృద్ధి, విజయాలు, ఆదాయం పెరగడం ఉంటుంది. సంఘాలకు సంస్థలకు ఆధిపత్య అవకాశాలు లభిస్తాయి. వ్యాపార లావాదేవీలందు ఆటంకాలు తొలగి రాబడి పెరుగుతుంది. క్రొత్త కాంట్రాక్టులు, వ్యాపారంలో భాగస్వాములుగా చేరడం ఉంటుంది. దూరప్రయాణాలు జరిగి పనులు నెరవేరతాయి. ప్రభుత్వ అనుమతులు పొందగలరు.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

ప్రముఖులు ఆత్మీయులను కలుసుకొంటారు. వ్యాపారస్తులకు అభివృద్ధి అవకాశాలు ఆలస్యం కావచ్చు లేక చేజారిపోవచ్చును. ఆదాయం తగ్గి, ఖర్చులు పెరుగుతాయి. ఉద్యోగులకు వ్యాపారులకు అధికారుల వత్తిడి ఉండవచ్చును. వృత్తిపరంగా మంచి గుర్తింపు రాబడి ఉంటుంది. అనుకున్న పనులు నిదానంగా సాగుతాయి. సోదరులకు మేలు జరుగవచ్చును.

# ఉగ్రవాదికి ఉరిపై బి.జె.పి ఆనందం



భారతదేశ పౌరుడి ఉన్నతత్వానికి ప్రతీకగా నిలిచే పార్లమెంట్ భవనంపై దాడిచేసిన కాశ్మీరీ ఉగ్రవాది అప్జల్‌గురును ఉరి తీయడంపై ఆనందాన్ని ప్రకటిస్తూ బిజేపీ లీగల్ సెల్ జిల్లా ప్రతినిధులు నెల్లూరు జిల్లా కోర్టు దగ్గర ఈనెల 9న బాణాసంచా కాల్చి మిఠాయిలు పంపిణీచేసారు. ఈ సందర్భంగా కన్వీనర్ దాసరి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఉగ్రవాద కార్యక్రమాలకు అడ్డుకట్టువేసే విధంగా ప్రభుత్వం ఈ చర్యలు తీసుకోవడం సంతోషంగా వుందన్నారు. దీంతో ప్రపంచదేశాల్లో భారతదేశ గౌరవం ఇనుమడిస్తుందన్నారు. క్షమాభిక్ష పిటిషన్‌ను రాష్ట్రపతి ఆమోదించకుండా శిక్షను అమలు చేయడం దేశప్రజల మనోభావాలను గౌరవించినట్టయిందన్నారు. కార్యక్రమంలో బిజెపి సభ్యులు ఈఎస్ జగదీశ్వర్, ఎం.ఈశ్వరరావు, నెల్లూరు బార్ అసోసియేషన్ కార్యదర్శి ఈవి రామిరెడ్డి, సభ్యులు హనుమంతుశెట్టి, బిఎస్ రంగరాజన్, రమేష్‌రెడ్డి, రమణారెడ్డి, వెంకయ్య జయచందర్, రామకృష్ణ మొదలగువారు పాల్గొన్నారు.

# క్రమశిక్షణతోనే మంచి ఫలితాలు

క్రమశిక్షణ కలిగి ఏకాగ్రతతో కష్టపడి చదివి ఉత్తమఫలితాలు సాధించాలని జిల్లా కలెక్టర్ బి.శ్రీధర్ పేర్కొన్నారు. 10వ తేదీ నెల్లూరు డి.ఆర్.డి.ఎ సమావేశం హాలులో 10వతరగతి గిరిజన విద్యార్థినీ, విద్యార్థులతో ఉత్తమ ఫలితాల సాధనకై జరిగిన అవగాహన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రధానంగా 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యే ముందు భయం లేకుండా ప్రశాంతమైన మనస్సుతో చదివిన విషయాలు గుర్తుంచుకొని పరీక్షలురాసి ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. ప్రతి విద్యార్థి ఒకలక్ష్యాన్ని పెట్టుకొని ధృడసంకల్పంతో, ఆత్మవిశ్వాసంతో ఒక కాలమానం (టైంటేబుల్) పెట్టుకొని ఆ క్రమంలో కష్టపడి చదివి సాధించాలన్నారు. ప్రతి రోజు ఉదయం ఐదునిమిషాలు మెడిటేషన్ చేసి తమ మనస్సులను ఏకాగ్రతతో వుంచుకొని దురాలోచనలు విడనాడి మంచి ప్రవర్తనతో మెలిగి ఇతరులకు మార్గదర్శకులుగా వుండాలన్నారు. పరీక్షలలో నిర్దేశించిన సమయానికంటే గంట ముందుగానే తయారై పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలన్నారు. 10వతరగతి పాసై అంతటితో చదువు నిలిపివేయకుండా పై చదువులు కొనసాగించి ఉన్నతవిద్య అభ్యసించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. ఈ విషయంలో తమ తల్లిదండ్రులను ఎదిరించైనా చదువుకోవాలన్నారు. ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను ఏకాగ్రతతో విని, అర్థం చేసుకొని, జ్ఞాపకం వుంచుకొని మరలా పాఠ్యాంశంలోని విషయాలను ఒకసారి రాసి, అంశాల గురించి పునశ్చరణ చేసుకోవాలన్నారు.

10వతరగతిలో సాధారణ ఉత్తీర్ణత పొందడమే కాకుండా, 95 శాతం మార్కులుపైగా (ఏగ్రేడ్) సాధించేందుకు కష్టపడి చదివి జంకు, బొంకు లేకుండా పరీక్షలురాసి అనుకున్న ఆశయాన్ని సాధించాలన్నారు.

ఈ కార్యక్రమంలో ఐ.టి.డి.డి.ఎ పి.ఓ వై.వెంకటేశ్వర్లు, జిల్లా గిరిజన సంక్షేమాధికారి నారాయణ, గిరిజన అభివృద్ధి అధికారి వరప్రసాద్, వివిధ హాస్టల్స్‌కు చెందిన ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితర అధికారులు పాల్గొన్నారు.




# పెళ్లి సంబంధాలు

## వధువు కావలెను

1. 1984 ఆగష్టు 23 జననం. ఎత్తు 5'11". చదువు బి.టెక్(ఇ.సి.ఇ), యం.బి.ఏ(చెన్నై). ఉద్యోగం అసోసియేట్ కన్సల్టెంట్, విప్రో, బెంగుళూరు. జీతం నెలకు 1లక్ష. ఉన్నతమైనరెడ్డి ఉద్యోగకుటుంబం. ఆస్థి విలువ 18కోట్లు. స్వస్థలం చిత్తూరుజిల్లా.
2. 1979 మే 5 జననం. ఎత్తు 5'6". చదువు బి.కాం(లక్నో యూనివర్సిటీ) యం.బి.ఏ(ఇంటర్నేషనల్ బిజినెస్, ప్రాజెక్టు మేనేజిమెంట్), అలహాబాద్. ఉద్యోగం శ్రీగిరి టివి ఆఫీస్, న్యూఢిల్లీ. జీతం నెలకు 1లక్ష. ఆస్థి విలువ 5కోట్లు. ఉన్నతమైనరెడ్డి వ్యాపారకుటుంబం. స్వస్థలం చెన్నై, ప్రస్తుత నివాసం ఢిల్లీ.
3. 1984 ఆగష్టు 25 జననం. ఎత్తు 5'10". చదువు బి.ఇ(చెన్నై). ఉద్యోగం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ లిమిటెడ్, చెన్నై, అసిస్టెంట్ కన్సల్టెంట్. జీతం నెలకు రూ॥80,000/-. ఆస్థివిలువ 5కోట్లు. ఉన్నతమైనరెడ్డి వ్యాపారకుటుంబం. స్వస్థలం నెల్లూరుజిల్లా.
4. 1982 ఆగష్టు 26 జననం. ఎత్తు 5'5". చదువు బి.యస్.సి(కంప్యూటర్స్), న్యూఢిల్లీ. యం.యస్.సి(కంప్యూటర్స్ నెట్‌వర్క్స్(యు.కె). ఉద్యోగం 45లక్షలు సం॥నకు. కంపెనీ సెంట్రికా ఎనర్జి-టెస్ట్‌ఎనలిస్ట్, విండ్‌సర్. ఆస్థి విలువ 5కోట్లు. ఉన్నతమైనరెడ్డి వ్యాపారకుటుంబం. స్వస్థలం నెల్లూరుజిల్లా.
5. 1985 ఫిబ్రవరి 18 జననం. ఎత్తు 5'7". చదువు బి.టెక్, ఐ.ఐ.ఐ.టి-నోయిడా, యం.బి.ఏ-స్మాంట్-చెన్నై, ఉద్యోగం బిజినెస్ ఆపరేషన్ మేనేజరు. హెవలెట్ ప్యాకర్డ్(హెచ్.పి), బెంగుళూరు. జీతం నెలకు 1లక్ష. ఉన్నతమైనరెడ్డి ఉద్యోగకుటుంబం. ఆస్థివిలువ 4కోట్లు. స్వస్థలం నెల్లూరుజిల్లా.

## వరుడు కావలెను

6. 1989 డిసెంబరు 11 జననం. ఎత్తు 5'31/2". చదువు బి.టెక్(కంప్యూటర్స్) హైదరాబాద్. ఉద్యోగం అసిస్టెంట్ మేనేజర్, స్టేట్‌బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్. జీతం నెలకు 40,000/-. ఉన్నతమైనరెడ్డి వ్యాపారకుటుంబం. ఆస్థివిలువ 35లక్షలు. స్వస్థలం తూర్పుగోదావరిజిల్లా. ప్రస్తుతనివాసం హైదరాబాద్.
7. 1991 జూలై 13 జననం. ఎత్తు 5'4". చదువు బి.టెక్(ఇ.సి.ఇ), యం.టెక్(యంబెడెడ్ సిస్టమ్స్). ఉన్నతమైనరెడ్డి వ్యాపారకుటుంబం. ఆస్థివిలువ 10కోట్లు. స్వస్థలం చిత్తూరుజిల్లా.
8. 1987 మే 15 జననం. ఎత్తు 5'6". చదువు యం.బి.బి.యస్, కర్నూలు, యుయస్‌యం.యల్ స్టెప్స్ పూర్తయినవి. ప్రస్తుతం హోస్టన్(అమెరికా). స్వస్థలం కడపజిల్లా. ఆస్థివిలువ 5కోట్లు. ఉన్నతమైనరెడ్డి వ్యాపారకుటుంబం.
9. 1990 జనవరి 30 జననం. ఎత్తు 5'6". చదువు యం.బి.బి.యస్. ఉన్నతమైనరెడ్డి వ్యాపారకుటుంబం. ఆస్థివిలువ 3కోట్లు. స్వస్థలం చిత్తూరుజిల్లా.
10. 1992 జనవరి 24 జననం. ఎత్తు 5'4". చదువు బి.బి.ఏ(బెంగుళూరు). ఉన్నతమైనరెడ్డి వ్యాపారకుటుంబం. ఆస్థి విలువ 15కోట్లు. ప్రస్తుతనివాసం హైదరాబాద్.



వివరాలకు: కొండూరు హరినారాయణరెడ్డి, 25-9-413, పోస్టల్‌కాలనీ, ఆంధ్రకేసరినగర్, నెల్లూరు - 4.
98480 34522
94406 39460.
పోస్టుబాక్స్ నెం.4, C/o. లాయర్ జాతీయ తెలుగు వారపత్రిక, ఫ్లాట్ నెం. 1 & 2, మెయిన్‌రోడ్డు, మాగుంట లే-అవుట్, నెల్లూరు - 3.

PDF Compressor Free Version



## మూ'వీ'క్షణం






## శృతి సందడి

గబ్బర్‌సింగ్‌తో తెలుగు ప్రేక్షకులకు బాగా దగ్గరయిన శ్రుతిహాసన్ యంగ్‌టైగర్ ఎన్టీఆర్‌తో మరోసారి తెలుగు తెరమీదకు రానుంది. హరీష్‌శంకర్ డైరెక్షన్‌లో వస్తున్న ఈ సినిమాలో సమంత కూడా ఒక హీరోయిన్‌గా ఉండడం విశేషం. దిల్ రాజు ఈ సినిమా నిర్మిస్తున్నాడు.



## మైనస్ నుండి ప్లస్‌లోకి

విశ్వరూపంకు ఎన్ని కష్టాలొచ్చాయే ఇటీవల చూశాం. ఈ సినిమా కోసం తన ఆస్తులను సుమారు 67కోట్లు తనఖా పెట్టాడు కమల్‌హాసన్. ఐతే ఈ సినిమా విడుదలయ్యాక అదిరిపోయే కలెక్షన్‌లు వస్తున్నాయి.



## 'మిర్చి'తో టాప్‌గేర్

మిర్చి సినిమా హిట్‌తో యంగ్ రెబల్‌స్టార్ ప్రభాస్ టాప్ స్టార్‌లలో ఒకరిగా చేరిపోయాడు. ప్రస్తుతం మిర్చి సినిమా బాక్సాఫీస్ బద్దలు కొడుతుంది. ఓపెనింగ్స్ బ్రహ్మాండంగా ఉన్నాయని ప్రతి సెంటర్ నుంచి టాక్.



## సీక్రెట్ ఏజెంట్ రామాచారి

కామెడీ హీరో వేణు నటించిన రామాచారి సినిమా ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఏడాది కాలంగా సెట్స్ పైనే ఉంది. ఈ సినిమాని విజయప్రసాద్ అండ్ గ్రూప్ వారు తీసుకుని మార్చి ఒకటికి విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.



## వీరభద్రుడిగా రానా

అనుష్క ప్రధానపాత్రలో నటిస్తున్న రుద్రమదేవి సినిమాలో కథానాయకుడిగా రానా నటించనున్నారు. గుణ టీమ్ వర్క్స్ పతాకంపై డైనమిక్ డైరెక్టర్ గుణశేఖర్ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ఈ హిస్టారికల్ స్టీరియోస్కోపిక్ త్రీడీ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. కాకతీయుల చరిత్రతో ఈ చిత్రాన్ని ఎంతో ధైర్యంగా తీస్తున్నారు.

నాలుగు తరాలుగా న్యాయవాద వృత్తిలో తరిస్తున్న

## యరగుడిపాటి రామారావు కుటుంబం



సీనియర్ న్యాయవాది వై.రామారావును సన్మానిస్తున్న దృశ్యం

యరగుడిపాటి రామారావు ప్రముఖ న్యాయవాది కీర్తిశేషులు వై.హనుమంతరావు కుమారుడు తే.23.10.1927న జన్మించినారు. తరువాత తేది 8.2.1949సంవత్సరంలో న్యాయవాది వృత్తిలో ప్రవేశించారు. వీరి తండ్రి గారు వై.హనుమంతరావు 1927 నుండి 1953 వరకు న్యాయవాది వృత్తిలో పనిచేశారు. యరగుడిపాటి రామారావు జిల్లా కోర్టులో గూడూరు, వెంకటగిరి, మరియు సూళ్ళూరుపేట కోర్టులలో క్రిమినల్, సివిల్ కేసులు అనేకం వాదించారు. న్యాయశాస్త్రంలో సివిల్ మరియు క్రిమినల్ శాస్త్రాలలో అనేక పుస్తకములు రచించారు. అంతర్జాతీయ స్థాయిలో ఖ్యాతి గడించినారు. ఆంధ్రప్రదేశ్ అప్పటి ప్రధాన న్యాయమూర్తులు జస్టిస్ యస్.బి.సిన్హా, జస్టిస్ రమేష్‌దేవ్‌లు ఆయన్ను సన్మానించారు. ఆయన గవర్నమెంటు ప్లీడరుగాను, పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గాను, మున్సిపల్ న్యాయవాది మరియు దేవాదాయశాఖ న్యాయవాదిగా పలు బాధ్యతలు అత్యంత ప్రతిభతో నిర్వర్తించారు. ఈయన కుమారుడు వై.చలపతిరావు గత 35సంవత్సరములుగా న్యాయవాదిగా, మనవడు వై.అరవింద్ న్యాయవాదిగా గత 6సంవత్సరములుగా ప్రాక్టీస్ చేస్తున్నారు. మొత్తం 130 సంవత్సరములుగా న్యాయవాద వృత్తిలో 4తరాలుగా వున్న ఏకైక కుటుంబం. ఇప్పటికీ వై.రామారావు రోజుకు 10గంటలకుపైగా కంప్యూటర్‌పైన న్యాయశాస్త్రం గురించి రచనలు చేస్తూ వుంటారు. ఈయన దగ్గర సుమారు 20మంది న్యాయవాదులు న్యాయవిద్యను అభ్యసించారు. వై.రామారావు న్యాయవాది వృత్తి చేపట్టిన 65ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఇటీవల ఆయనను గూడూరు లయన్స్ క్లబ్ సభ్యులు న్యాయవాదులు ఘనంగా సత్కరించారు. ఈ విషయాన్ని గిన్నిస్ బుక్ఆఫ్ వరల్డ్ రికార్డులో తప్పకవేయవలసిన విషయమని పలువురు న్యాయవాదులు "లాయర్"తో అన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడరు యరగుడిపాటి చలపతిరావు, వై.అరవింద్, ప్రముఖ న్యాయవాదులు బి.రామదాస్, బాబురెడ్డి, బాలచంద్రరాజు, నటరాజన్, సి.వి.సుబ్బారెడ్డి, పి.వి.ప్రభాకరరావు, రామరాఘవరెడ్డి, గోపాలరెడ్డి, రామశాస్త్రి, టి.రఘురామిరెడ్డి, పబ్లిక్ ప్రాసిక్యూటర్ రజనీకాంత్‌రెడ్డి, డాక్టర్ సి.ఆర్.రెడ్డి, బ్రాహ్మణ సేవాసంఘ గౌరవాధ్యక్షులు ఎస్.నాగరాజారావు, లయన్స్‌క్లబ్ తరపున మల్లు విజయకుమార్‌రెడ్డి, నవీన్ జయకుమార్, సురేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.



## గూడూరు డివిజన్ వార్తలు

రోటరీక్లబ్ ఆధ్వర్యంలో

### వృద్ధులకు ఫలసరుకులు పంపిణీ



ఫలసరుకులు పంపిణీచేస్తున్న డాక్టర్ సి.రోహిణి స్నేహలతారెడ్డి.

గూడూరు రోటరీక్లబ్ ఆధ్వర్యంలో మఠంవీధిలోని రోటరీ భవనంలో ఆదివారం వృద్ధులకు డాక్టర్ సి.రోహిణి చేతులమీదుగా ఫలసరుకులను పంపిణీచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదలను గుర్తించి క్లబ్ చేయూత అందించడం హర్షణీయమన్నారు. ఇన్నర్‌వీల్ అధ్యక్షురాలు స్నేహలతారెడ్డి దాతృత్వంతో వృద్ధులకు దుప్పట్లు పంపిణీచేశారు. కార్యక్రమంలో ఆ క్లబ్ ప్రతినిధులు డాక్టర్ కె.మోహర్మణి, జానకిరామిరెడ్డి, కె.సుందరరామిరెడ్డి, దశరథరామిరెడ్డి, కె.ఎస్.రెడ్డి, జి.డి.రెడ్డి, మయూరిశ్యాం యాదవ్, చిన్నమల్లయ్య, శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

గూడూరు..

### సబ్ కలెక్టర్‌కు అర్జీల వెలువ

ప్రజా విజ్ఞప్తుల దినాన్ని పురస్కరించుకొని సోమవారం గూడూరు సబ్ కలెక్టర్‌కు డివిజన్‌లోని పలుప్రాంతాల నుండి ప్రజలు పెద్దసంఖ్యలో తమ సమస్యలను పరిష్కరించాలంటూ అర్జీలు సమర్పించారు. ఇందులో ప్రధానంగా భూసమస్యలపై రాష్ట్రప్రభుత్వం చేపట్టిన భూపంపిణీ కార్యక్రమంలో అర్హత ఉన్న పేదవారికందరికీ భూమి పంపిణీ చేయడం జరుగుతుందని ఆయన హామీ ఇచ్చారు. భూఅక్రమణల విషయంలో సంబంధిత అధికారులు పరిశీలించి తగిన న్యాయం చేయాలని తహశీల్దారులను తక్షణ పరిష్కారంచేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రేషన్‌కార్డులు, పింఛన్లు, తదితర సమస్యలపై సబ్ కలెక్టర్‌కు అర్జీలు వచ్చాయి.


**ఇంటి స్థలం అమ్మబడును**

గూడూరు నరసింగరావుపేట రాములవారి గుడివీధిలో 30 అం॥ల ఖాళీస్థలము అమ్మబడును.

వివరాలకు:

సెల్: 098401 50113


## క్రీడలతో కీర్తి ప్రతిష్టలు

నెల్లూరు నగర ఎమ్మెల్యే ముంగమూరు

క్రీడలతో కీర్తిప్రతిష్టలు లభిస్తాయని, క్రికెట్ అంతర్జాతీయ సంబంధాలను వృద్ధి చేస్తుందని నెల్లూరు నగర ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి అన్నారు. ఈనెల10న గూడూరు ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో జరిగిన అంతర్ కళాశాలల టి-20 క్రికెట్ పోటీల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. క్రికెట్ జెంటిల్‌మెన్ గేమ్‌గా ప్రసిద్ధి చెందిందన్నారు. ఇటువంటి పోటీలను నిర్వహిస్తున్న ఆదిశంకర కళాశాల యాజమాన్యాన్ని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. కళాశాల ఛైర్మన్ వంకి పెంచలయ్య మాట్లాడుతూ తమ కళాశాల ఈ క్రీడల నిర్వహణ ద్వారా విద్యార్థుల బహుముఖ వికాసానికి తోడ్పడుతుందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎవిఎస్ ప్రసాద్ మాట్లాడుతూ తమ కళాశాల ఆధ్వర్యంలో గత 5సంవత్సరాలుగా ఈ టి-20 క్రికెట్ పోటీలను నిర్వహిస్తున్నామని, క్రీడలకు, విద్యకు సమప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్ కొడాలి, కళాశాల పిడి రవిచంద్ర, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.




**జన్మదిన శుభాకాంక్షలు**

బావ "బాస"లే బాటగా...
సేవారంగంలో ఎందరికో బాసటగా...
మంచితనానికి మారుపేరుగా నిలచి...
పారిశ్రామికవేత్తగా వేనోళ్ళ కీర్తింపబడుతున్న
మా **తానంకి నానాజీ** గారికి
(జ్యోతి వేబ్రిడ్జి, చిల్లకూరు)
పుట్టినరోజు(ఫిబ్రవరి 15) శుభాకాంక్షలు.



మీ..
**పాశం సునీల్‌కుమార్**
మాజీ మునిసిపల్ ఛైర్మెన్ మరియు
వై.యస్.ఆర్.కాంగ్రెస్ పార్టీ నాయకులు
గూడూరు.

PDF Compressor Free Version



# కల్యాణ వైభవం!




విడవలూరు మండలం ఊటుకూరు వాస్తవ్యులు శివారెడ్డి వెంకటరమణారెడ్డి - శ్రీమతి పార్వతిల కుమారుడు **సాయిగిరిధర్ - పెట్రాజాగల్** (ఆస్ట్రియా దేశస్తులు డా॥ వాల్టర్‌జాగల్ - శ్రీమతి ఈడిత్ జాగల్‌ల పుత్రిక)ల కల్యాణం ఫిబ్రవరి 14వ తేదీ నెల్లూరులో వైభవంగా జరిగింది. నూతనవధూవరులకు 'లాయర్' శుభాకాంక్షలు.



నెల్లూరురూరల్ మండలం కొండ్లపూడి వాస్తవ్యులు బెజవాడ ఫణిరాజ ప్రసన్నరెడ్డి - శ్రీమతి పద్మావతిల కుమారుడు **సాయిరత్నాకర్ - దీప్తిరెడ్డి** (బెంగుళూరు వాస్తవ్యులు కలికి కోదండరామిరెడ్డి కుమార్తె)ల వివాహం ఫిబ్రవరి 13వ తేదీ నెల్లూరులో ఘనంగా జరిగింది. కొత్త దంపతులకు 'లాయర్' అభినందనలు.



రాజీవ్‌విద్యామిషన్ ప్రాజెక్ట్ ఆఫీసర్ దేగపూడి కోదండరామిరెడ్డి - శ్రీమతి హేమలతల కుమారుడు **హరీష్‌కుమార్- సంధ్యారాణి** (హైదరాబాద్ వాస్తవ్యులు మెండా ప్రభాకర్‌రావు కుమార్తె)ల పరిణయం ఫిబ్రవరి 14వ తేదీ నెల్లూరు సిపిఆర్ కల్యాణ మండపంలో వేడుకగా జరిగింది. నూతనజంటకు 'లాయర్' శుభదీవెనలు.



నెల్లూరు వాస్తవ్యులు జమిలి జ్వాలాఆంజనేయులు - శ్రీమతి రాజ్యలక్ష్మిల కుమారుడు **సత్యనారాయణ - వెంకట అనూష** (నెల్లూరు వాస్తవ్యులు కటకం వేణుగోపాలరావు కుమార్తె)ల పెళ్ళి ఫిబ్రవరి 13వ తేదీ తిరుమలలో శ్రీవారి సన్నిధిలో ఘనంగా జరిగింది. నవవధూవరులకు 'లాయర్' శుభాభినందనలు.

### అమోఘం..అద్భుతం...

# నిర్విరామ నృత్యనీరాజనం

## 12గంటలు నిరంతర నృత్యనీరాజనాన్ని ప్రదర్శించిన చిన్నారులు



సింహపురి చరిత్రలో ఇది వరకు ఎన్నడూ జరగని విధంగా ప్రముఖ వాగ్గేయ కారులకు 12గంటల పాటు నిర్విరామ నృత్యనీరాజనం జరిగింది. స్థానిక శ్రీగురు కృప కళాక్షేత్రం 14వ వార్షికోత్సవం సందర్భంగా నగరంలోని టౌనుహాలులో 9వ తేదీ ఉదయం చిన్నారుల నృత్య కార్యక్రమం ప్రారంభమైంది. తొలుత సంస్థ అధినేత్రి సురభిగాయత్రి ఆధ్వర్యంలో జ్యోతి ప్రకాశాన్ని నగరప్రముఖులు రాళ్ళపల్లి సుబ్బలక్ష్మి, పంచాగ్నుల వెంకటవిశ్వనాథం, ఆలూరు శిరోమణిశర్మ వీరిశెట్టి హజరత్‌బాబు, వాకాటి విజయకుమార్‌రెడ్డిలు గావించారు. అనంతరం పురంధరదాసు రచించిన "ఘజవధనవేదు" అనే కీర్తనకు సీనియర్ కళాకారిణి కల్పన ప్రారంభ నృత్యంతో మొదలైన నిర్విరామ నృత్యనీరాజనంలో అన్నమాచార్యుల కీర్తన "కృష్ణం వందే జగద్గురుంకు" చిన్నారులు వాత్సల్య, సారిక, నవ్య,నిఖిత, ఉమ, రిషిత, జాహ్నవి, ప్రీతి, దామిని, సంక్రియ, కావేరి, ప్రదర్శించి కరతాళ ధ్వనులు అందుకున్నారు. ఇదే ప్రక్రియలో వాగ్గేయ కారులైన సద్గురు శ్రీ త్యాగ రాజతీర్థులు, జయదేవుడు, శ్రీరామదాసు, క్షేత్రయ్యల కీర్తనలకు 150మంది గురు కృప కళాక్షేత్రం విద్యార్థినిలు 95అంశాలపై శాస్త్రీయ నృత్యాలను నిరంతరంగా ప్రదర్శించి అందరి ప్రశంసలు అందుకున్నారు.

ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా రైల్వే డీఎస్పీ శ్రీనివాసులనాయుడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హోటల్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు అమరావతి కృష్ణారెడ్డి, వాకాటి విజయకుమార్‌రెడ్డి, మెట్టు రామచంద్రప్రసాద్, నలుబోలు బలరామయ్యనాయుడు, వీరిశెట్టి హజరత్ బాబు, అగస్త్యరెడ్డి వెంకురెడ్డి, పంచాగ్నుల వెంకట విశ్వనాథం, డా॥ ఈదూరు సుధాకర్, వొమ్మిన సుబ్రహ్మణ్యం, తదితర నగర ప్రముఖులు పాల్గొని 150 మంది చిన్నారులకు మెమెంటోలు అందజేశారు.

# దుర్మార్గులకు ఉరే సరి...

**- మేకపాటి సోదరులు**

దుత్తలూరు మండలం సోమలరేగడలో అతికిరాతకంగా హత్యలకు పాల్పడిన ప్రేరేపించిన దుర్మార్గులకు ఉరే సరైన శిక్షని నెల్లూరు ఎంపి మేకపాటి రాజమోహన్‌రెడ్డి, ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖరరెడ్డి అన్నారు. మంగళవారం సంఘటనాస్థలాన్ని మేకపాటి సోదరులు పరిశీలించారు. జరిగిన తీరుపై స్థానికుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలోకి వెళ్ళి ఎలాంటి భయాందోళనకు గురికావద్దని మహిళలకు, గ్రామస్తులకు భరోసా ఇచ్చారు. పోలీసు ఉన్నతాధికారులు మాట్లాడి నిందితులకు సరైన శిక్ష పడేలా కృషిచేస్తామన్నారు. ఈ దురాగతంపై డిజిపి దినేష్ రెడ్డితో మాట్లాడతానన్నారు. వీరివెంట జడ్పీ మాజీచైర్మెన్ బాలచెన్నయ్య, వైయస్సార్ సిపి జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యులు చేజర్ల చలమారెడ్డి గణపం బాలకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సరస్వతీనిధికి 50వేలు విరాళం



పేద విద్యార్థులకు ఉచిత కార్పొరేట్ విద్యను అందించేందుకు జిల్లా కలెక్టర్ బి.శ్రీధర్ ఏర్పాటు చేసిన సరస్వతీనిధికి ఐటిడీఏ ఏపిడీ పద్మలత రూ50వేలు విరాళాన్ని 12వ తేదీ కలెక్టర్‌ను కలసి చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ పద్మలతను అభినందించారు.

### విద్యార్థినిపై అత్యాచారం ఘటనకు నిరసనగా

# రవీంద్రభారతి స్కూలు విధ్వంసం

గూడూరు రవీంద్రభారతి పాఠశాలలో విద్యార్థినిపై జరిగిన అత్యాచారానికి నిరసనగా నెల్లూరు ఫత్తేఖాన్‌పేట రమేష్‌రెడ్డినగర్‌లో ఉన్న రవీంద్రభారతి స్కూలు శాఖను సోమవారం భారత విద్యార్థి సమాఖ్య ముట్టడించింది. అత్యాచారానికి పాల్పడిన ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలని నగరశాఖ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. పాఠశాలకు సెలవుకావడంతో విద్యార్థులు ఎవరూ రాలేదు. ఎంతసేపటికి యాజమాన్యం స్పందించకపోడంతో విద్యార్థి నాయకులు ఆగ్రహించి, స్కూలు బస్సుల అద్దాలను, తరగతి గదుల అద్దాలను ధ్వంసంచేశారు. పాఠశాలలోని వస్తువులు చెల్లాచెదురుచేసి, పూలకుండీలను పగులగొట్టారు. పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీధర్, సిబ్బంది సంఘటనా స్థలం వద్దకు చేరుకోగానే విద్యార్థి నాయకులు పరారయ్యారు. వెంటనే నాల్గవ నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. పోలీసులు వచ్చి పరిస్థితిని పరిశీలించారు.

అమ్మ ఫర్నిచర్ వారి
అమ్మ ఫర్నిచర్‌మాల్
మినీబైపాస్‌రోడ్డు, నెల్లూరు.
ప్రపంచస్థాయి మోడల్స్
ఇంపోర్టెడ్ & ఇండియా ఫర్నిచర్

సత్యంజీ
సింహపురి సిటి
అందమైన గ్రీన్ పార్క్
వి.జి.ఆర్. స్కూల్ దగ్గర, ధనలక్ష్మీపురం, మెయిన్ రోడ్డు, ముత్తుకూరు రోడ్డు, నెల్లూరు.
డ్యూప్లెక్స్ హౌస్
ప్రారంభం ధర 39 లక్షలు
మొదటి ఇద్దరికి 5 లక్షల విలువ గల ప్లాటు గిఫ్ట్‌గా ఇవ్వబడును.
ఈ హౌస్ పూర్తి అయిన తరువాత ఖచ్చితమైన ధర 49 లక్షలు
డబుల్ బెడ్ రూం హౌస్
ప్రారంభం ధర 34 లక్షలు
మొదటి ఇద్దరికి 5 లక్షల విలువ గల ప్లాటు గిఫ్ట్‌గా ఇవ్వబడును.
ఈ హౌస్ పూర్తి అయిన తరువాత ఖచ్చితమైన ధర 44 లక్షలు
You Tube, R.R., S.Tv., Gem Channels చూడండి.
శుక్రవారం 7.30 P.M.
శనివారం 10.30 A.M.
7.30 P.M.
ఆదివారం 10.30 A.M.
బ్యాంకు లోన్ సౌకర్యం కలదు
9133 222 558
0861-2318286, 2341183
08622272555

PDF Compressor Free Version



# ప్రతి గుండెలో ఆవేదన... పోటెత్తిన నిరసన

- నెల్లూరులో తల్లీకూతుళ్ల హత్యపై ఉద్యమించిన విద్యార్థిలోకం
- ధర్నాలు, ఆందోళనలతో దద్దరిల్లిన నగరం
- నిరసనలలో ఢిల్లీ గ్యాంగ్‌రేప్ ఘటనను గుర్తుకుతెస్తున్న నెల్లూరు

*సినిమా, ప్రసారమాధ్యమాల ప్రభావంతోనే యువత చెడిపోతుందనేది నిర్వివాదాంశమని రుజువుచేసింది ఈ నెల 13న నెల్లూరు హరనాథపురంలో జరిగిన తల్లీకూతుర్ల హత్యోదంతం.*




నారాయణ వైద్యకళాశాల విద్యార్థుల నిరసన ప్రదర్శన

మనిషిలో నిద్రిస్తున్న రాక్షసత్వం సినిమాల ప్రభావంతో ఒక్కసారిగా మేల్కొని విచక్షణ మరచి విజృంభిస్తుంది. కుటిల, కుతంత్రాలతో పరుల సొమ్మును తమ పరం చేసుకోవడానికి ఎంతకైనా తెగబడేలా చేస్తుంది. ప్రశాంతతకు మారుపేరుగా నిలిచివున్న నెల్లూరును ఈమధ్య జరిగిన సంఘటనలు మాత్రం ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. "దండుపాళ్యం" సినిమా పదిసార్లు చూసి హత్యకు పాల్పడి దోపిడీ చేయాలని నిశ్చయించుకున్నట్లు హంతకుడు ఇంతియాజ్ పోలీసు విచారణలో తెలిపినట్లు వినవచ్చింది. సినిమాలు యువతరాన్ని ఎంత ప్రభావితం చేస్తున్నాయో దీనినిబట్టి అర్థం చేసుకోవచ్చు. జిల్లాలో విచ్చలవిడి దొంగతనాలకు, దోపిడీలకు హత్యోదంతాలకు మరొక ముఖ్యకారణం పోలీసుల వైఫల్యమేనని జిల్లా ఎస్పీ గారు అంగీకరించక తప్పదు. ఎప్పుడూ లేని విధంగా జిల్లాలో వరుస దొంగతనాలు ప్రతిరోజూ జరుగుతుండడం ఒకవైపైతే, రెండోపార్శ్వం ఇటీవల కావలిలో, నెల్లూరు మూలాపేటలో, మొన్న సోమలరేగడలో, నిన్న నెల్లూరు హరనాథపురంలో జరిగిన హత్యాకాండలు భయంతో ప్రజలను నిద్ర పోనివ్వడం లేదు. రేపేం జరుగుతుందో ఏమోనన్న ఆందోళనతో కూడిన జీవనం సాగుతోంది. పోలీసుల వైఫల్యంపై పలు అంశాలు వినిపిస్తున్నాయి. పోలీసుల చర్యలలో రాజకీయ ప్రభావం పెరిగిపోవడం, ఎస్పీ ఉదాసీనవైఖరితో పోలీసుసిబ్బందిలో నిర్లిప్తత, తగినంత పోలీసు సిబ్బంది లేకపోవడం ఈ పరిస్థితికి కారణాలుగా నిలుస్తున్నాయి.

ఏదేమైనా హరనాథపురంలో జరిగిన హత్యోదంతం, దోపిడీపై ఇటు అన్నివర్గాలకు చెందిన ప్రజలలో, అటు విద్యార్థులు, యువతలో ఆగ్రహం, ఆవేశం పెల్లుబికింది. హత్యోదంతం జరిగినప్పుడే స్పందించిన స్థానికులు హంతకులను పోలీసుల నుంచి తమకప్పగించమని కోరడం తామే శిక్షిస్తామనడం చూస్తుంటే సంఘజీవనంలో నిర్లిప్తత, నాకెందుకనే భావన తొలిగిపోయినట్టనిపిస్తోంది. పక్కరోజు నెల్లూరులో తోటి విద్యార్థిని భార్గవిని హత్యచేసిన హంతకులను కఠినంగా శిక్షించాలని కోరుతూ నారాయణ మెడికల్ కళాశాల, తదితర నారాయణ విద్యాసంస్థల విద్యార్థులు భారీసంఖ్యలో రామలింగాపురం మినీబైపాస్‌రోడ్ నుంచి ప్రదర్శనగా వెళ్లి జిల్లా ఎస్పీ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించడం... ఎస్పీ రమణకుమార్‌తో మాట్లాడి, కలెక్టర్ బంగ్లాకు వెళ్లి కలెక్టర్‌కు తమ విజ్ఞప్తిని ముక్తకంఠంతో వినిపించడం, విద్యార్థుల స్పందన పట్ల జిల్లా కలెక్టర్ శ్రీధర్ కూడా సానుకూలంగా వ్యవహరించడం గమనార్హం. విద్యార్థుల నిరసన ప్రదర్శనతో పాటు రాజకీయపార్టీలు బీజేపీ, తెలుగుదేశం, వైయస్సార్ కాంగ్రెస్‌లు, విద్యార్థిసంఘాలు ఏబివిపి, టీఎన్ఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐలు, మహిళాసంఘాలు ఎబివిపి, టీఎన్ఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐలు, మహిళా సంఘం ఐద్వా తదితర ప్రజాసంఘాలు ఆ సంఘటన పట్ల తమ నిరసనను తెలుపుతూ విఆర్ కళాశాల సెంటర్‌లో పెద్దఎత్తున రాస్తారోకో నిర్వహించాయి. గురువారం నగరంలోని పాఠశాలలు, కళాశాలలు, కొన్నిచోట్ల దుకాణాలు స్వచ్ఛంధంగా బంద్ పాటించి హత్యోదంతం పట్ల తమ నిరసన తెలిపాయి.

ఏదేమైనా ఉవ్వెత్తున ఎగిసిన ఈ నిరసన కెరటాలను జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ, జిల్లా మంత్రి, ఎమ్మెల్యేలు తదితరులు సాదాసీదా నిరసనలుగా తీసుకోకుండా త్వరితగతిన తగుచర్యలు తీసుకోవలసిన అవసరం ఎంతైనా వుంది. ఈ సందర్భంలో గతంలో జిల్లా ఎస్పీగా పనిచేసిన శ్రీనివాసులురెడ్డి చర్యలు గుర్తుకొస్తున్నాయి. ఆయన దొంగలకు, రౌడీలకు, దోపిడీదారులకు సింహస్వప్నంగా నిలిచి జిల్లావాసుల గుండెల్లో నిలిచిపోయాడు. ఆ మంచిరోజులు మళ్లీ నెల్లూరుకొచ్చేలా జిల్లా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చేయాలని ప్రజలందరూ కోరుతున్నారు.



బైఠాయించిన విద్యార్థినులు




ఎస్పీ కార్యాలయం ఎదుట భారీ ఆందోళన


## డబ్బుకోసమే తల్లీకూతుళ్ల హత్య

**ఆరునెలలుగా దోపిడీకి పథకరచన...**

**నిందితులకు కఠినశిక్షలు పడేలా కేసులు నమోదు...**

**- జిల్లా ఎస్పీ బి.వి.రమణకుమార్**

డబ్బు కోసమే తల్లీకూతుళ్లను హత్యచేసారని, ఆరు నెలలుగా దోపిడీకి పథకరచన చేశారని, నిందితులకు కఠినశిక్షలు పడేలా కేసులు నమోదు చేస్తామని జిల్లా ఎస్పీ బి.వి.రమణకుమార్ పేర్కొన్నారు. మంగళవారం నెల్లూరు హరనాథపురం రెండవవీధిలో జరిగిన తల్లీకూతుర్ల హత్యకేసుకు సంబంధించిన వివరాలను బుధవారం తన కార్యాలయంలో నిందితులను మీడియా ముందు హాజరుపరచి మాట్లాడారు. షేక్ ఇంతియాజ్ ఇంటీరియర్‌గా పనిచేస్తూ దినకర్‌రెడ్డి ఇంటికి ప్లాన్ డిజైన్ చేసాడని, ముత్తుకూరు మండలం బ్రహ్మదేవి గ్రామంలో దినకర్‌రెడ్డికి చెందిన వాగ్దేవి ఫార్మసీ కళాశాలకు కూడా ప్లాన్ డిజైన్ చేసాడని తెలిపారు. ఈ నేపథ్యంలో దినకర్‌రెడ్డి కళాశాలకు చెందిన లక్షలాది రూపాయలు ఇంటికి తీసుకెళ్ళడం గమనించిన ఇంతియాజ్ ఆ నగదును కాజేస్తే జీవితాంతం హాయిగా ఉండవచ్చనే ఉద్దేశ్యంతో ఆరు నెలలక్రితమే దోపిడీ చేసేందుకు పథకం రచించారన్నారు. అందులో భాగంగానే బాలాజీనగర్ ప్రాంతానికి చెందిన గుండ్లపల్లి మురళీమనోహర్ అనే ఇంటర్ చదివే విద్యార్థిని, అల్‌హుదా కళాశాలలో డిప్లొమాచేసే వంశీకృష్ణను పరిచయం చేసుకుని, దినకర్‌రెడ్డి ఇంట్లో దోపిడీ చేస్తే దాదాపు 40లక్షలవరకు దొరుకుతుందని, దాంతో డైరీఫాం పెట్టుకుని హాయిగా ఉండొచ్చని వారిరువురికి ఆశచూపి వారికి పథకం వివరించి ఈ దోపిడీ హత్యలకు పాల్పడ్డారని తెలిపారు. ఈ హత్యకేసును త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రత్యేకకోర్టు ఏర్పాటుచేసేందుకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపుతున్నట్లు ఎస్పీ తెలిపారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ ఎల్.టి.చంద్రశేఖర్, డీఎస్పీలు వెంకటనాథ్‌రెడ్డి, బాలవెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, సిఐలు వీరాంజనేయరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, రాంబాబు, ఆర్ఐ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.






Edited, Published, Printed & owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY**, Executive Editor-**G.SREENIVASULU REDDY**.